J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 42 సంచిక : 11 19.8.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# రాజకీయాల ముసుగులో రాక్షసులు

## అమాత్యుల నీడలో అప్రాచ్యులు - నేతల అండతో నేరాలు

*ఒకప్పుడు రాజకీయమంటే హుందాతనం, విలువలున్న వ్యక్తులు, గౌరవప్రదమైన కుటుంబాల సభ్యులు, ప్రజాసేవ కోసం రాజకీయ రంగప్రవేశం చేసి తమ సేవాపరిమళాలతో సమాజాన్ని గుభాళింప చేసేవారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పట్ల స్పందిస్తూ... వారి అవసరాలను గుర్తించి, వారి సమస్యలను పరిష్కరింపచేయడం కోసం అహరహం శ్రమించే వారు. సేవాభావం పట్ల తమకున్న ఆసక్తి కారణంగా దీర్ఘకాలం ప్రజాక్షేత్రంలో ఉంటూ తద్వారా రాజకీయ రంగంలో తమ ఉనికిని కాపాడుకోవడానికి తపించే వారు. అలా రాజకీయ రంగంలో రాణించిన ఎందరో మంచివాళ్ళు మహానుభావులుగా, మహనీయులుగా చరిత్రలో మిగిలిపోయారు.*

కానీ, నేటి కాలంలో రాజకీయమంటేనే రాక్షసత్వంగా మారిపోయింది. ఆధిపత్యపు ధోరణి, అహంకారపు పోకడ, అక్రమ సంపాదనే లక్ష్యంగా నేటి నేతలు వ్యవహరిస్తున్నారు. మారుతున్న కాలంతో పాటూ వాళ్ళూ మారారు. సామాజిక సేవ(సోషల్ సర్వీస్) అన్న పదానికి స్పెల్లింగ్ కూడా తెలియని వారు ఇప్పుడు రాజకీయాలలో రాణిస్తున్నారు. నగరాలలో అయితే కౌన్సిలర్, కార్పొరేటర్, గ్రామాలలో అయితే సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటీసీలుగా తమ రాజకీయ జీవితం మొదలుపెట్టి, ధనార్జన, దౌర్జన్యం, రౌడీయిజంలలో తమ సత్తా చూపెట్టి శాసనసభ్యులుగాను, శాసన మండలి సభ్యులుగాను, మంత్రులుగానూ పదోన్నతి సాధిస్తున్నారు. పై అన్ని లక్షణాలతో పాటు పెద్దపెద్ద స్కామ్‌లతో వందల కోట్లకు పడగలెత్తి ఉండడం, కనీసం ఒక్కసారైనా జైలుకు వెళ్ళి ఉండటం, లేదా స్థానిక పోలీసుస్టేషన్లలో నాలుగైదు కేసులన్నా నమోదు కాబడి ఉండడం కూడా ఇప్పటి రాజకీయాలకు అర్హతలుగా మారిపోయాయి. మద్యం, మైనింగ్, ఇసుక మాఫియా కింగులు రాజకీయాలలో ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కోట్ల రూపాయలు పార్టీల ముఖాన కొట్టి పదవులను తమ సొంతం చేసుకుంటున్నారు. తమ అక్రమ సంపాదనలను కాపాడుకోవడానికి

10 లో



# కొండ దిగి వచ్చిన కోనేటి రాయుడు

## సింహపురిలో కొలువైన దేవదేవుడు

- అంగరంగ వైభవంగా శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాలు
- వి.పి.ఆర్ దంపతుల పుణ్యం.. భక్తుల జీవితాలు ధన్యం

*కోనేటిరాయడు కొండదిగి వచ్చాడు. నేరుగా నెల్లూరుకు వచ్చి కొలువుదీరాడు. ఎంత భాగ్యమో సింహపురి సీమకు!...సాక్షాత్తూ కలియుగ ప్రత్యక్షదైవమైన ఆ దేవదేవుని రాకతో నెల్లూరు నేల పునీతమైంది. శ్రీవారి దర్శనభాగ్యంతో వేలాదిమంది భక్తజనులు పులకించిపోతున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాల వారి నేతృత్వంలో, రాజ్యసభ సభ్యులు.. సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి..ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డిల సారథ్యంలో.. 'న భూతో న భవిష్యతి' అన్నట్లుగా వైభవాతివైభవంగా జరుగుతున్న శ్రీ వేంకటేశ్వరుని వైభవోత్సవాలతో నెల్లూరు ఆధ్యాత్మికశోభతో దేదీప్యమానమైంది. ఏసి సుబ్బారెడ్డి స్టేడియం 'గోవింద' నామాలతో మార్మోగిపోతోంది.*

3 లో





# అమృతోత్సవాలు విజయవంతం

## మంత్రి కాకాణి



దేశానికి స్వాతంత్రం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ మహాశక్తి దేవత అయిన జ్వాలాముఖి అమ్మవారికి హారతి నివ్వడం సంతోషకరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 15వ తేది రాత్రి తోటపల్లిగూడూరు మండలం వరిగొండలోని జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానంలో జరిగిన దీపారాధన కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతి ఒక్కరిలో నింపేందుకు, జాతీయభావాన్ని, దేశభక్తిని పెంపొందించేందుకు నిర్వహించిన అమృత్ మహోత్సవాలు సంపూర్ణంగా విజయవంతమయ్యాయని, భారత జాతి మొత్తం ఏకతాటిపై నిలిచి ఈ మహోత్సవాలు విజయవంతం అయ్యేందుకు సహకరించారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు రవీంద్రయ్య, ఎంపీడీఓ సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

### ఇరుకళల అమ్మవారి దేవాలయంలో..

# విరిసిన మువ్వన్నెల పతాక



ఆజాది కా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 15న 76వ స్వాతంత్ర్యవేడుకల సందర్భంగా నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో మువ్వన్నెల పతాక రెపరెపలాడింది. పురాతన దేవాలయంగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయం ఆజాది కా అమృత మహోత్సవ్ కార్యక్రమానికి ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా 13,14,15 తేదీలలో ఆలయ ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ రావు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు కంచర్ల పెంచలమ్మ, పల్లాల రాములమ్మ, కందుకూరు వెంకటేశ్వర్లు ఆచారి, రాచూరు రమేష్ యాదవ్, సోమవరపు అనుషా, ముని, కట్టా చిన్నా, ఎక్స్ అఫిషియో సభ్యులు.. ప్రధాన అర్చకులు పులికొలను చంద్రశేఖర్‌స్వామి, కార్యనిర్వహణాధికారి కుడారి పెంచలవరప్రసాద్, పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌లో..

# అంబరాన్నంటిన స్వాతంత్ర్య సంబరాలు



అల్లూరు మండలం, నార్త్‌మోపూరు గ్రామం వద్ద ఉన్న దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌లో ఆగస్టు 15న 76వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. అల్లూరులోని రామకృష్ణ విద్యాసంస్థల విశ్రాంత సంస్కృత ఉపన్యాసకులు, ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. దేశ స్వాతంత్ర్య సిద్ధికి ఎన్నో త్యాగాలు చేసిన స్వాతంత్ర్యయోధులు, దేశభక్తుల పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. వారి త్యాగాలను ఆదర్శంగా తీసుకుని, ప్రతి ఒక్కరూ దేశాభ్యున్నతికి కృషిచేయాలని అన్నారు. కులమతాలకు అతీతంగా ఉంటూ దేశసమైక్యతకు పాటుపడాలన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర 'మాస్ సంస్థల' సిఇఓ చంద్రశేఖర్‌రెడ్డి ఈ సందర్భంగా నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో భాగంగా కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్ ద్వారా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ట్రస్ట్ సిఇఓ దేవన్‌కుమార్, మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ జెట్టి రమేష్, నైపుణ్య శిక్షణ కార్యక్రమ ఇన్‌ఛార్జ్ రామచంద్రరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



### పసుపుకొమ్ముల అలంకారంలో

# అంకాళమ్మతల్లి

నెల్లూరులోని కిసాన్‌నగర్ సింహపురి కాలనీలో కొలువై ఉన్న గ్రామదేవత అంకాళమ్మ తల్లికి ఆలయ అర్చకులు ఇటీవల విశేషంగా 150 కిలోల పసుపుకొమ్ములతో అమ్మవారి సన్నిధిని అత్యద్భుతంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేయడం అందరినీ ఆకట్టుకుంది. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి అంకాళమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

### కళాలయ చారిటబుల్ ట్రస్ట్

# సేవలకు ప్రశంస



నెల్లూరులోని శ్రీ కళాలయ చారిటబుల్ ట్రస్ట్ సేవలను గుర్తిస్తూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు15న నెల్లూరు పోలీస్‌పెరేడ్ మైదానంలో జరిగిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా ఆ ట్రస్ట్ అధ్యక్షురాలు, ప్రముఖ విద్యావేత్త గూడూరు లక్ష్మి ప్రశంసాపత్రం అందుకున్నారు.

### కలువాయమ్మకు

# ప్రత్యేక పూజలు

కలువాయి గ్రామదేవత 'కలువాయమ్మ అమ్మవారి'కి ఆలయ అర్చకులు ఈనెల14న ప్రత్యేకపూజలు నిర్వహించారు. పూలమాలికలతో అమ్మవారిని కన్నుల పండువగా అలంకరించారు. పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. నెల్లూరు విజయ కుమార్‌రెడ్డి– సుజాత దంపతులు, సాయి పవన్, నందిత, వారి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

### 'ముందర పొట్టెమ్మ తల్లి'..

# తిరునాళ్ల 25 నుంచి

మహిమాన్విత దేవతగా ప్రసిద్ధిచెందిన కావలి రూరల్ మండలం అన్నగారి పాలెంలో కొలువై ఉన్న శ్రీ ముందర పొట్టెమ్మ అమ్మవారికి ఆగస్టు 25 నుంచి 29వ తేది వరకు అయిదురోజుల పాటు తిరునాళ్ల జరగనుంది. అన్నగారిపాలెం గ్రామస్తులు, తుమ్మలపెంట ప్రముఖులు ఇటీవల అమ్మవారి తిరునాళ్ల కరపత్రాలను ఆవిష్కరించారు. తిరునాళ్ళలో భాగంగా గంగమ్మతల్లికి కుంభాభిషేకం మహోత్సవాలు కూడా నిర్వహిస్తామని తెలిపారు.

# మహనీయుల త్యాగాలను మరువరాదు

### - విఎస్‌యు వీసీ ఆచార్య సుందరవల్లి



నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఆగస్టు 15న 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపకులపతి ఆచార్య జియం సుందరవల్లి ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ 75 సంవత్సరాలలో మనదేశం సాధించిన ప్రగతిని ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఎందరో త్యాగధనుల, మహనీయుల త్యాగఫలాల ఫలితమే ఈరోజు మనం అందరం స్వేచ్ఛగా ఉండగలుగుతున్నామన్నారు. అనంతరం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విఎస్‌యు కళాశాల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ వారు నిర్వహించిన ప్రత్యేక కోర్సులలో ప్రావీణ్యం పొందిన వారికి సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఆ తర్వాత విఎస్‌యు నుంచి అయ్యప్పగుడి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. 7కిలోమీటర్ల దూరం సాగిన ఈ ర్యాలీలో దేశభక్తి గీతాలు, నినాదాలతో పెద్ద సంఖ్యలో విశ్వవిద్యాలయం అధ్యాపక, అధ్యాపకేతర మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా.పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య విజయ్ ఆనంద కుమార్‌బాబు, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమ నిర్వాహకులు డా. కె సునీత, డా. ఆర్.మధుమతి, డా. ఉదయ్‌శంకర్ అల్లం, డా. సుబ్బ రామరాజు, డా. సి.కిరణ్మయి, డా. హనుమరెడ్డి, డా. ప్రవీణ్ , డా. జి.సుజయ్, డా. సాయిప్రసాద్‌రెడ్డి, ఆచార్య అందె ప్రసాద్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

# కేంద్ర కారాగారంలో..రక్షాబంధన్



రాఖీ పండుగ సందర్భంగా ఇటీవల నెల్లూరులోని కేంద్ర కారాగారంలో 'దిశ' ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ నేషనల్ చైర్మెన్ బి.వి. రాజు ఆదేశాల మేరకు ఖైదీలకు రాఖీలు కట్టి, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి నిడిగుంట అరుణ మాట్లాడుతూ ఖైదీలందరూ సత్ప్రవర్తన కలిగివుండాలన్నారు. ప్రతి ఖైదీకి కుటుంబం ఒకటి ఉంటుందని గుర్తెరిగి అందరూ మంచి అలవాట్లతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ భీమతాటి సారిక, కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారి కె. రాజేశ్వరరావు, అడిషనల్ సూపరింటెండెంట్ ఎమ్ మహేష్‌బాబు, డెప్యూటీ సూపరింటెండెంట్ ఎ.బి. కాంతరాజ్, జైలర్ వి.రమేష్, డెప్యూటీ జైలర్లు టి.దుర్యోధన, కిషోర్‌కుమార్, నరేష్‌కుమార్, వేణుగోపాల్, గోవింద రాజులు, జైలు టీచర్ విజయకుమార్, ఫౌండేషన్ సభ్యులు వాదనాల సరిత, అరవ ప్రమీల, పనబాక జయప్రద, ఆత్మకూరు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతోనే ఉన్నతస్థాయి

### - ఎన్‌సిసి శిక్షణా శిబిరంలో వినయ్ రామచంద్రన్



కొడవలూరు మండలంలోని రామన్నపాలెంలో ఉన్న ఆదిశంకర కాలేజీలో ఈనెల 13న ఎన్‌సిసి వార్షిక శిక్షణా శిబిరం ప్రారంభమైంది. ఈనెల 20వతేది వరకు నిర్వహించే ఈ శిబిరంలో నెల్లూరు, గుంటూరు, అనంతపురం జిల్లాలకు చెందిన 386 మంది ఎన్‌సిసి కేడెట్లు పాల్గొన్నారు. 10వ ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్, శిక్షణా శిబిరం కమాండెంట్ వినయ్ రామచంద్రన్ నేతృత్వంలో జరుగుతున్న ఈ శిక్షణా శిబిరంలో ప్రారంభం రోజున వినయ్ రామచంద్రన్ మాట్లాడుతూ, జీవితంలో అన్నింటికంటే ముఖ్యం క్రమశిక్షణ అని, క్రమశిక్షణ కలవారే ఉన్నతస్థాయికి చేరుకుంటారని క్యాడెట్లకు చెప్పారు. అనంతరం ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కలిగించి, ఆయుధ శిక్షణ, వ్యక్తిత్వ వికాసం, ఓడలో లంగర్ పాత్ర, నావిగేషన్ తదితర అంశాలపై కాడెట్లకు శిక్షణనిచ్చారు. వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సింగంశెట్టి భాస్కర్ పాల్గొని పాము కాటు వేస్తే ఆ బాధితుని ఆదుకునేందుకు తీసుకోవలసిన సత్వర జాగ్రత్తల గురించి, మూర్ఛవ్యాధి నివారణ, తేలుకాటు పట్ల జాగ్రత్తలు తదితర అంశాలపై కాడెట్లకు అవగాహన కలిగించారు. ఎన్‌సిసి అసోసియేట్ అధికారులు గుండాల నరేంద్రబాబు, షేక్ ఖాదర్‌బాషా, కేర్‌టేకర్లు, తదితరులు పాల్గొన్నారు

# కొండ దిగి వచ్చిన కోనేటి రాయుడు

- అంగరంగ వైభవంగా శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాలు
- వి.పి.ఆర్ దంపతుల పుణ్యం.. భక్తుల జీవితాలు ధన్యం





*ఆపదమొక్కులవాడు..ఆపద్బాంధవుడు..అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు..కలియుగ ప్రత్యక్ష దైవం..ఆ తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు ఏడుకొండలూ దిగి వచ్చి.. నెల్లూరులో కొలువుదీరాడు. ఆ దేవదేవుని రాకతో సింహపురి సీమ భక్తిపారవశ్యంతో పులకించిపోతోంది. నెల్లూరు మరో తిరుమలగా భాసిస్తూ, అశేష భక్తజనకోలాహలంతో, పండుగ వాతావరణంతో కళకళలాడుతోంది. టిటిడి, విపిఆర్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఆగస్టు 16వ తేది నుంచి జరుగుతున్న 'శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాలు'.. నయనానందకరంగా జరుగుతున్నాయి. ఈనెల 20వ తేది దాకా..అయిదు రోజులపాటు జరిగే ఈ వైభవోత్సవాల్లో ప్రతిరోజూ భక్తులు వేలసంఖ్యలో పాల్గొని శ్రీవారిని దర్శించుకుని తరిస్తున్నారు. టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి సహకారంతో, టిటిడి అధికారులు, ఆలయ అర్చకులు శ్రీవారి సేవలకు అన్ని ఏర్పాట్లు చేశారు. రాజ్యసభ సభ్యులు.. సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి. టిటిడి ఉత్తరభారతదేశ ఆలయాల సలహామండలి అధ్యక్షురాలు ప్రశాంతిరెడ్డి.. సాక్షాత్తూ ఆ తిరుమలేశుని వైభవోత్సవాలను కళ్లారా తిలకించే భాగ్యం నెల్లూరు ప్రజలకు కలిగించారంటే..ఇంతకన్నా పుణ్యం మరేముంటుంది?.. 'నీవిచ్చిన ఈ జన్మకు నీసేవే భాగ్యం'..అన్నట్లుగా ఆ పుణ్యదంపతులు శ్రీవారి సేవకు అంకితం కావడం వారి పూర్వజన్మ సుకృతం! వారి జీవితాలు ధన్యం!.. ఈ వైభవోత్సవాల్లో కన్నులపండువగా కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుని దర్శించుకోవడం భక్తులకు లభించిన మహదవకాశం.. ఇదొక మహద్భాగ్యం!..*

తిరుమల తిరుపతి దేవస్థానాలు, నెల్లూరులోని విపిఆర్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతున్న 'శ్రీ వేంకటేశ్వరుని వైభవోత్సవాల'తో తిరుమలేశుని భక్తులందరికీ ఈ వైభవోత్సవాల్లో స్వామివారిని సునాయాసంగా దర్శించుకునే భాగ్యం కలిగింది. తిరుమలలో జరుగుతున్నట్లుగానే ఇక్కడ కూడా శ్రీవారికి అన్ని సేవలు, పూజలు నిర్వహిస్తుండడం విశేషం. శ్రీవారి సేవలను నేరుగా తిలకించే అవకాశం కలగడం అదృష్టమే! తిరుమలకు వెళ్ళిన భక్తులందరికీ స్వామివారికి నివేదించే అన్ని సేవలు, పూజలు, వారోత్సవాలు చూసి తరించడం సాధ్యం కాదు. వయోభారం చేతనో, ఆర్థికంగా స్తోమతు లేకనో స్వామివారిని మళ్ళీ మళ్ళీ దర్శించుకోలేకపోతున్న భక్తులు కోట్లాదిమంది. దీంతో స్వామివారే భక్తుల చెంతకు చేరి వారిని అనుగ్రహించే రీతిలో టిటిడి వారు 'శ్రీవారి వైభవోత్సవాలను' ప్రారంభించారు. గతంలో 2015 ఆగస్టు 8 నుంచి 16 దాకా తొమ్మిదిరోజుల పాటు శ్రీవారి వైభవోత్సవాలను నెల్లూరులో ఇదే వేదికపై టిటిడి, విపిఆర్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగాయి. చాలాకాలం తర్వాత మళ్ళీ ఇప్పుడు ఈ అద్వితీయమైన దైవకార్యం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా శ్రీవారి వైభవాన్ని చాటే ఆధ్యాత్మిక ప్రసంగాలు, సంకీర్తనల గానాలు, భక్తి కార్యక్రమాలు..అన్నీ ఆద్యంతం భక్తులను బాగా ఆకట్టుకుంటున్నాయి.

## శ్రీవారి పూజలు..సేవలు..అత్యద్భుతం :

తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకస్వాములే స్వయంగా ఇక్కడికి వచ్చి స్వామివారికి అన్ని అలంకారాలు, పూజలు, సేవలు చేస్తుండడం విశేషం. సుప్రభాతసేవ, తోమాలసేవ, అర్చన, కొలువు, సహస్రదీపాలంకరణ సేవ, ఏకాంతసేవ మొదలైన విశిష్టసేవలన్నిటినీ వారు అత్యద్భుతంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు స్వామివారి సుప్రభాతసేవ ప్రారంభమవుతుంది. 6.30 నుంచి 7.30 దాకా తోమాలసేవ, కొలువు, 7.30 నుంచి 8.15 దాకా అర్చన, 8.15 నుంచి 8.30 దాకా నివేదన, శాత్తుమొర శాస్త్రోక్తంగా జరుగుతాయి. ఇంకా ఎన్నో రకాల విశేషపూజలు, సేవలు కూడా క్రమబద్ధంగా నిర్వహిస్తున్నారు. విద్యుత్‌దీపాల వెలుగులతో, పూల అలంకరణలతో ప్రాంగణమంతా ఆధ్యాత్మికశోభతో అలరారుతోంది. దివ్యమైన వేదికపై మనోహరంగా నిలచిన ఆ దేవదేవుడు.. చిరుదరహాసంతో భక్తుల పూజలందుకుంటూ అందరినీ కటాక్షిస్తున్నాడు.

## 20న శ్రీ శ్రీనివాస కల్యాణం :

ఈనెల 19న సుప్రభాతం, తోమాలసేవ, కొలువు, అర్చన, నివేదనలతో పాటు ఉదయం 8.30 నుంచి 10 గంటల దాకా శ్రీవారికి అభిషేకం ఉంటుంది. రెండవ నివేదన, శాత్తుమొర అయ్యాక ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల దాకా స్వామివారి దర్శనానికి భక్తులు వేలాదిగా బారులు తీరుతారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 దాకా సహస్ర దీపాలంకార సేవ, 6.30 నుంచి 7.30 దాకా వీధి ఉత్సవం, 7.30 నుంచి 8.30 దాకా రాత్రి కైంకర్యం, 8.30 నుంచి 9 గంటల వరకు ఏకాంత సేవ ఉంటాయి.

20వ తేది ఉదయం 8.30 నుంచి 9.15 దాకా పుష్పయాగం నేత్ర పర్వంగా నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కల్యాణం ఎంతో వైభవంగా జరుగుతుంది. భక్తవరదుడైన ఆ ఏడుకొండల వెంకటరమణుని వైభవాన్నంతా ఈ వైభవోత్సవాల్లో దర్శించుకుని తరించే భాగ్యం కలగడంతో భక్తులంతా శ్రీవారిని దర్శించుకుని పులకించి..పరవశించిపోతున్నారు.





## జయహో!.. భారత్ మాతా!...

ఆగస్టు 15న 76వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాజీ ఉప రాష్ట్రపతి, మన నెల్లూరీయులు ముప్పవరపు వెంకయ్యనాయుడు హైదరాబాద్‌లోని తన నివాసంలో త్రివర్ణపతాకం ఆవిష్కరించి పతాక వందనం గావించారు. 75ఏళ్ల స్వతంత్ర భారతంలో సాధించిన విజయాలను, ప్రగతిని చూసి గర్విస్తూ..మనముందున్న సవాళ్ళు పేదరికం, నిరక్షరాస్యత, సాంఘిక అసమానతలు, లింగ వివక్ష, అవినీతి వంటి వాటిని సమైక్యంగా ఎదుర్కొందామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ శుభవేళ మన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుందామని, ఆత్మనిర్భర్ భారత్‌వైపు పురోగమిద్దామని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

## విఆర్‌సిలో ముప్వన్నెల జెండా



నెల్లూరులోని చరిత్రాత్మకమైన వి.ఆర్ కాలేజీలో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కొంతమంది పూర్వ విద్యార్థులు ముప్వన్నెల జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత ప్రిన్సిపాల్స్ డా. యం.సుబ్రహ్మణ్యం, బాబర్ అలి మొహిద్దీన్‌లతో పాటు పూర్వ విద్యార్థులు, జి.వి.నాగరాజరావు (హైకోర్టు న్యాయవాది), కె.వి.నరసింహారావు, పి.వి. శేషారెడ్డి, సిహెచ్ కేశవులు, పి.మురళీకృష్ణ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



## ఉత్తుంగ తరంగంగా "హర్ ఘర్ తిరంగా"

భారత దేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని ఇచ్చిన "హర్ ఘర్ తిరంగా" ఉల్లాసంగా ఉత్సాహంగా ఉత్తుంగ తరంగంగా జరిగింది. ప్రచార ఆర్భాటాలతో ప్రభుత్వాలు కోట్లు ఖర్చు పెట్టాయి. సామాన్య జనం మాత్రం తమ తమ స్థోమతని బట్టి ముప్వన్నెల జండాలను కొనుగోలు చేసి వారి ఇళ్ళపై మురిపెంగా ఎగుర వేసి తమ దేశభక్తిని చాటుకున్నారు. ఎర్రకోటపై జెండా ఎగురవేసిన భారత ప్రధాని తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో 'కరోనా కష్ట కాలంలో జనతా కర్ఫ్యూ విధించినా, చప్పట్లతో కరోనాను తరిమికొట్టమన్నా, దీపకాంతులతో దేశాన్ని ప్రకాశింప చేయమన్నా ప్రజలు విశేషంగా స్పందించారని, ఇప్పుడు 'హర్ ఘర్ తిరంగా' పేరుతో ఇచ్చిన పిలుపుకి కూడా అదే స్థాయిలో స్పందించడం భారతీయుల దేశభక్తికి నిదర్శనమని ఆనందం వ్యక్తం చేశారు.

ఆగస్టు 15వతేదీ మధ్యాహ్నం వరకూ ప్రజలు జెండాలు కొంటూనే ఉన్నారు. తపాలా శాఖ సరఫరా చేసిన జెండాలలో నాణ్యత కనిపించింది. బహిరంగ మార్కెట్లో వ్యాపారస్తులు మాత్రం నాసిరకం జెండాలను అమ్మి సొమ్ము చేసుకున్నారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలలో, పాఠశాలల్లో జెండాను తిరగదిప్పి ఎగురవేయడం దేశభక్తుల మనసుకు బాధ కలిగించింది. ముఖ్యంగా స్కూలు పిల్లలు పట్టుకున్న జెండాలలో చాలాచోట్ల ఇలాంటి దృశ్యాలు కనిపించాయి. ఏది ఏమైనా స్వాతంత్ర్య వజ్రోత్సవ వేళ యావత్ భారతదేశం ఒక్కసారిగా తమ దేశభక్తిని చాటుకోవడం చిరస్మరణీయ ఘట్టం.

-విహారి

## మత్స్యకారులను ఆదుకోండి

### - కలెక్టర్‌కు రామ్‌కుమార్‌రెడ్డి వినతి



పేద మత్స్యకారులను ఆదుకోవాలంటూ రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఇటీవల జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబును కలసి విన్నవించారు. కండలేరు రిజర్వాయర్‌కు సంబంధించిన దాచూరు మత్స్యకార సహకార సొసైటీ సభ్యులు తనకు ఇచ్చిన వినతిని ఆయన కలెక్టర్‌కు అందజేశారు. దాచూరు మత్స్యకార సొసైటీకి మరో ఒకటిన్నర సంవత్సరం కాలపరిమితి ఉన్నప్పటికీ స్థానిక నాయకులు వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, చేపల మాఫియాతో కలసి నిరుపేదలైన యానాదులను ఇబ్బందులు పెడుతున్నారని, ఈ విషయం పరిశీలించి పేద మత్స్యకారులను ఆదుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమికి ఇస్కాన్ 'ఆన్‌లైన్' పోటీలు

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో కల్చరల్ ఫెస్ట్ నిర్వహిస్తున్నామని, ఆన్‌లైన్‌లో జరిగే ఈ పోటీలకు ప్రపంచంలో ఎక్కడ నుండైనా పాల్గొనవచ్చని, అవధులు లేని ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు ఆగస్టు 20వ తేది లోగా ఫోన్ నెం.89776 37108, లేదా 89197 17982 లకు సంప్రదించవచ్చని నెల్లూరులోని ఇస్కాన్ మం దిరం అధ్యక్షులు శుకదేవస్వామి తెలిపారు. కలరింగ్, శాస్త్రీయ-జానపద నృత్యాలు, ఫ్యాన్సీ డ్రెస్, గీతా శ్లోకాలు, గాత్ర సంగీతం, వంటలు, పూల అలం కరణలు, రంగోలి, ఏకపాత్రాభినయం, నృత్య రూపకాలు, కథ చెప్పడం, చేతి రాత, వ్యాసరచన, అలంకారం, పద్యాల, వాయిద్య సంగీతం, గజల్స్, వీడియోగ్రఫీ, ఫోటోగ్రఫీ, పెయింటింగ్ ఇలా ఎన్నో రకాల పోటీలుంటాయని పేర్కొన్నారు.

లాయర్
ఆగస్టు 19, 2022

# ఎంతో గర్వం.. కొంత విచారం

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 వసంతాలు పూర్తయి, 76వ స్వాతంత్ర్యదినోత్సవం ఆగస్టు 15న దేశవ్యాప్తంగా అత్యంత వైభవంగా జరగడం ఎంతో గర్వకారణం. ఎందరో మహనీయుల నిరుపమాన త్యాగాల ఫలితంగా మనకు లభించిన ఈ స్వాతంత్ర్యజ్యోతి వెలుగులు దేశంలో దశదిశలా ప్రకాశమానమవుతూనే ఉన్నాయి. మువ్వన్నెల పతాక రెపరెపలతో.. 'జై భారత్ మాతా' అంటూ ప్రజలు ఎంతో ఉద్వేగంతోచేసిన దేశభక్తి నినాదాలతో ఆగస్టు 15 దేదీప్యమానమైంది. దాదాపు రెండువందల సంవత్సరాల పాటు బ్రిటిష్ పాలకుల కర్కశ పాలనలో దేశంలోని ప్రజలు అమానుష హింసలకు గురవుతూ, చివరికి తమ అస్తిత్వమే కోల్పోయి, ఘోరంగా బతుకుతున్న దుర్దశలో..దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాట బాట పట్టిన స్వాతంత్ర్య యోధులు, మరెందరో మహానుభావులు చేసిన స్వాతంత్ర్య పోరాటం భారత దేశ చరిత్రలోనే ఒక మహోజ్వల ఘట్టం. బ్రిటిష్ పాలకుల నిరంకుశ విధానాలకు, దారుణ హింసాకాండలకు వ్యతిరేకంగా పూజ్య బాపూజీ అహింసను ప్రబోధిస్తూ దేశానికి మార్గనిర్దేశం చేయడం, శాంతి, సహనం, అహింసలతోనే కలసికట్టుగా పోరాడి దేశాన్ని దాస్యశృంఖలాల నుంచి విముక్తం చేయడం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎందరో మహనీయులను, స్వాతంత్ర్యపోరాట యోధులను స్మరించు కోవడం ప్రతి భారతీయుడి ధర్మం.

1921 మార్చి 31న విజయవాడలో జాతీయ కాంగ్రెస్ మహాసభల సందర్భంలో మహాత్మాగాంధీజీ స్వాతంత్ర్య యోధుడు.. మన తెలుగుజాతి కీర్తిమూర్తి అయిన పింగళి వెంకయ్యకు మనదేశ జాతీయ సమగ్రతను చాటేవిధంగా జాతీయపతాకాన్ని రూపొందించాలని చెప్పడం, ఆ మేరకు కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో, రైతులు.. కష్టజీవులకు గుర్తుగా మధ్యలో రాట్నంతో, శాంతి సామరస్యాలు, స్వచ్ఛమైన స్వేచ్ఛ, సౌభాగ్యాలకు ప్రతీకగా జాతీయజెండాకు రూపకల్పన చేయడం జరిగింది. ఆ జెండాపై బ్రిటిష్‌వారు కన్నెర్ర జేస్తే, అదే జెండాను చేతబట్టి మన స్వాతంత్ర్యవీరులు వీరోచితంగా శాంతియుత పోరాటం సాగించారు. బ్రిటిష్ పోలీసులు నిర్దయగా కాల్పులు జరుపుతున్నా జెండా ఒరిగిపోకుండా నిలబెట్టి, 'వందేమాతరం' అంటూ.. తాము నేల మీదకి ఒరిగిపోయిన స్వాతంత్ర్యయోధులెందరో!. ఆ తర్వాత స్వాతంత్ర్యం సిద్ధించే సందర్భంలో అశోకుడి ధర్మచక్రాన్ని జోడించి మన జాతీయపతాకానికి మరింత పరిపూర్ణత చేకూర్చారు. ఎంతో ఘనమైన వీరచరిత్ర మనది! అందుకే, 'త్రివర్ణ పతాక' అంటే..దేశంలోని 140 కోట్ల మంది ప్రజల హృదయ పతాక. విశ్వశాంతిని చాటే మన భారతజాతి ఔన్నత్యాన్నికి, శాంతి సామరస్యాలకు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు మన జాతీయపతాక.. ఒక ప్రతీక. ఒక్కమాటలో చెప్పాలంటే.. జాతీయపతాక అంటే భరతజాతి ప్రాణపతాక. జాతీయ పతాకాన్ని తలచుకుంటే చాలు.. గుండెల్లో ఉవ్వెత్తున దేశభక్తి ఉప్పొంగని వారుండరు. ఈ నేపథ్యంలో నాటి స్వాతంత్ర్య యోధుల త్యాగాలను నేటి తరానికి కూడా మరింతగా జ్ఞప్తికి తేవాలన్న ఆశయంతో, ప్రధాని మోడీ సూచనలతో కేంద్ర ప్రభుత్వం సూచించిన 'ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు', ప్రతి ఇంటిపై త్రివర్ణపతాకను ఆవిష్కరించాలంటూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాలు ప్రజల్లో దేశభక్తిని మరింతగా ఇనుమడింపజేయడం ఎంతో సంతోషకరం. నిజంగా ఈ తరంలోనే ఇదొక అద్వితీయ ఘట్టం. ముఖ్యంగా విద్యార్థులు, యువతలో దేశభక్తి ఉప్పొంగింది. అయినా..ఇప్పుడున్న మనమంతా 75 ఏళ్ళ స్వతంత్ర భారతావనిని చూడగలగడం ఎంతటి అదృష్టమో చెప్పలేం!...అయితే, ఇంతటి సంతోషకర సందర్భంలో కూడా నేటికీ దేశంలో అనేక దయనీయ సంఘటనలు, దారుణాలు జరుగుతూనే ఉండడం ప్రజలకు విచారం కలిగిస్తోంది. దేశం ఎంతో పురోగమిస్తున్నా ప్రపంచ ప్రగతి సూచీల్లో మనం ఇంకా ఎంతో వెనుకబడి ఉన్నాం. ఆకలికి అల్లాడే పేదలు పెరిగిపోతూనే ఉన్నారు. ఇంకా కుల వివక్షలు, మత విద్వేషాలు పోలేదు. పేదరికం తొలగిపోలేదు. నిరుద్యోగం సమసిపోలేదు. మహిళలకు ఆశించిన స్థాయిలో సాధికారత రాలేదు. సామాజిక అంతరాలు తరగడం లేదు. స్వార్థం తగ్గడం లేదు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, శాస్త్ర సాంకేతికతల పరంగా.. అన్ని రంగాల్లో దేశం ఇంకా ఎదగాల్సి ఉంది. అందుకు ప్రభుత్వాలు, ప్రజలు కలసి చేయాల్సిన కృషి మరెంతో ఉంది. శాంతికి నిలయమైన మనదేశాన్ని ప్రపంచంలోనే అద్వితీయమైన స్థానంలో నిలిపేందుకు ..ఈ స్వాతంత్ర్య వజ్రోత్సవాల స్ఫూర్తితో..వజ్రసంకల్పంతో ప్రతి భారతీయుడు ప్రతినబూని..మరింత దీక్షతో శ్రమించాల్సి ఉంది.

# 500 కోట్లు డ్రైనేజీ పాలు



నెల్లూరునగరంలో డ్రైనేజీ సమస్య అంతకంతకీ పెరిగిపోతోంది. 2016–17 ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీ పేరుతో సుమారు ఐదు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. నేషనల్ బ్యాంక్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) నుండి ఈ నిధులు మంజూరయ్యాయి. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నాం అంటూ ఆర్భాటంగా నగరం మూలమూలలా రోడ్లు తవ్వేశారు. పెద్ద పెద్ద యంత్రాలతో రోడ్లను పగులగొట్టి ఇళ్ల ప్రహరీలు సైతం పగుళ్లువచ్చి కృంగేలా కాంట్రాక్టర్లు తమ ప్రతాపం చూపించారు. సామాన్య మధ్యతరగతి ప్రజల ఇళ్లముందు మెట్లను సైతం కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా తొలగించారు. ఎవరైనా ఇదేం అన్యాయమని ప్రశ్నిస్తే, అభివృద్ధి జరుగుతోంది సహకరించండి అంటూ నచ్చ చెప్పారు. కొత్తా పాతా అని తేడా లేకుండా నగరంలోని రోడ్లన్నీ విధ్వంసం చేశారు. మరి అభివృద్ధి జరిగిందా...? రోడ్లు తొవ్వినందుకు ఫలితం లభించిందా..?? భూగర్భ డ్రైనేజీ సక్రమంగా పనిచేస్తుందా ??? అన్నిటికీ లేదు... లేదు... లేదు ... అనే సమాధానం వస్తుంది. పనిపూర్తయ్యి ఏడేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకూ మళ్ళీ ఆ ఊసే లేదు. నగర అభివృద్ధి సంగతి పక్కనపెడితే కాంట్రాక్టర్లు మాత్రం దొరికిన మేరకు దోచుకున్నారు. నాసిరకం పనులు చేసి డబ్బులు తినేశారు. ఈ అయిదు వందల కోట్ల కాంట్రాక్టు పెద్ద తిమింగలానికి వస్తే ఆ తిమింగలం ఆ పనిని ముక్కలు చేసి చిన్న

## సమస్యల తో 'రణం'

చిన్న చేపలకు ఎరేసి వారిచేత పని చేయించింది. పెద్దమొత్తంలో తిమింగలం మింగేస్తే చిన్న చేపలు చిల్లర ఏరుకుని జేబులు నింపుకున్నాయి. పని పూర్తయ్యింది, బిల్లులు పాసయ్యాయి, డ్రైనేజీ కనెక్షన్లు మాత్రం ఇవ్వలేదు. నగరవాసులు మాత్రం తమ ఇళ్లముందు పగిలిన మెట్లను తామే కట్టుకుని తమ జేబులకు చిలుము వదుల్చుకున్నారు. భూగర్భ డ్రైనేజీకి ఎప్పుడు కనెక్షన్ ఇస్తారా... కోట్ల సంఖ్యలో పుట్టుకొస్తున్న దోమల బారి నుండి తమకు విముక్తి ఎప్పుడు లభిస్తుందా అని తమ ఇళ్లముందు రహస్యంగా దాక్కుని ఉన్న డ్రైనేజీ పైపుల వైపు ఆశగా చూస్తున్నారు నగర ప్రజలు. నాబార్డ్ నుండి మంజూరైన మొత్తం మనకి అప్పుగా లభించిందే. ఎప్పటికైనా ఆ మొత్తం తిరిగి చెల్లించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన ఉంది. ఆర్భాటంగా మొదలుపెట్టి పూర్తి చేసిన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు ఇప్పటివరకు 10 శాతం కూడా కనెక్షన్లు ఇవ్వలేదు. కనెక్షన్లు ఇస్తే ప్రజలకు ఆ వ్యవస్థ ఉపకరిస్తుంది. డ్రైనేజీ కంపు తగ్గుతుంది. వర్షాల సమయంలో నీటి నిల్వలు ఉండవు. దోమల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ఈ వ్యవస్థను వాడుకున్నందుకు కార్పొరేషన్ నిబంధనల ప్రకారం విధించే నెలవారీ ఫీజులను కూడా ప్రజలు చెల్లిస్తారు. కార్పొరేషన్‌కీ డబ్బులొస్తాయి. కొంతలో కొంత అప్పు తీరుతుంది. కానీ, నాయకులకు, అధికారులకు ఇవేమీ పట్టవు. ప్రజలను దోచుకోవడం, దోచింది దాచుకోవడం... ఇదే వారి ధ్యేయం, లక్ష్యం!

- సంచారి

## 'తంగిరాల మహాభారతం'.. బాగుంది

'యు ట్యూబ్' ద్వారా తంగిరాల శ్యాం వివరిస్తున్న మహాభారతం చాలా బాగుంది. విషయాన్ని సాగదీయకుండా సూటిగా సుత్తి లేకుండా చెప్తున్నారు. ముఖ్యంగా ఒక్కొక్క భాగం కేవలం పదినిముషాలే ఉండడం కొత్తగా ఉంది. తమ వ్యాపార, ఉద్యోగ, సంసార బాధ్యతలతో తలమునకలైవుంటున్న ఈ తరం వారికి ఇలా తక్కువ నిడివి ఉన్న వీడియోలు బాగా ఉపయోగపడతాయి. ఎక్కువగా మానసిక వత్తిడి(స్ట్రెస్) కలిగినప్పుడు ఇలాంటి వీడియోలే ఉపశమనం కలిగిస్తాయి. అమెరికాలో స్థిరపడినప్పటికీ మన పురాణాలు, ఇతిహాసాలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల శ్యాం లాంటివాళ్లు చూపిస్తున్న శ్రద్ధ, ఆసక్తి అభినందనీయం. ఆయన చేస్తున్న ప్రయత్నానికి, ప్రయోగానికి 'లాయర్' అండగా నిలిచి, రాబోయే అంశాన్ని తమ పాఠకులకు ముందుగానే వివరించడం ముదావహం.

ఆర్.ఆర్.సుబ్బారావు, నెల్లూరు.

## రొట్టెల పండుగలో రాజకీయ సందడి

వివిధ మతాలు, కులాల వారు సంప్రదాయబద్ధంగా జరుపుకునే పండుగలను కూడా మన నేతలు వదలడంలేదు. ముఖ్యంగా నెల్లూరు బారాషహీద్ దర్గాలో మొహరం సందర్భంగా జరిగే రొట్టెల పండుగను గత కొన్ని సంవత్సరాలుగా వివిధ రాజకీయ పార్టీలు, వాటి నాయకులు రాజకీయ హైజాక్ చేసి సందడిగా మార్చేశారు. మా చిన్నతనంలో రొట్టెల పండుగ ఒక్క రోజు జరిగేది. మొహరం పండుగ అయిన పక్కరోజు మాత్రమే జనం దర్గాకి వచ్చేవాళ్ళు. ఇప్పుడు పెరిగిన జనాభా దృష్ట్యా ఈ పండగ మూడు రోజుల ప్రహసనంగా మారిపోయింది. అధికారులతో పాటు రాజకీయ నేతల హడావుడి ఎక్కువైపోయింది. ముఖ్యంగా మంత్రుల స్థాయి నేతలు కూడా ఇక్కడకు రావడం చూస్తుంటే 'రాజకీయాలకు కాదేదీ అనర్హం' అనిపిస్తోంది.

ఎం.నరసింహారావు, కావలి.

## గోపాలరెడ్డి గారిని విస్మరించడం దారుణం

భారతదేశ స్వాతంత్ర్య వజ్రోత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో ఆగస్టు నెలలో సరిగ్గా స్వాతంత్ర్య దినోత్సవానికి 10 రోజుల ముందు ఆగస్టు 5న వచ్చిన డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారి 115వ జయంతిని అందరూ విస్మరించడం దారుణం. ఇది ఇటు ప్రభుత్వం, అటు జిల్లాలోని అన్ని పార్టీల నాయకులూ సిగ్గుపడాల్సిన విషయం. తామేదో సమాజసేవ కోసమే అవతరించిన లోకోద్ధారకుల్లా తమ పుట్టిన రోజులకు ఊరంతా ఫ్లెక్సీలు, కటౌట్‌లు పెట్టుకుని సంబరాలు చేసుకుంటున్నారు నయాతరం నాయకులు. వాళ్ళు ఒక్కసారి ఓడిపోతే కనీసం వాళ్ళ మొహం చూసేనాథుడు కూడా ఉండరు. నిరాడంబరతతో, నిస్వార్థంగా నిజాయతీగా బ్రతికిన గోపాలరెడ్డి గారి లాంటి నాటి తరం నాయకుల ముందు వీళ్లంతా దిగదుడుపే. స్వాతంత్ర్యపోరాట సమయం నుండి తమ జీవితాలను ప్రజల కోసం, సమాజం కోసం అంకితం చేసిన మహానుభావులు వాళ్ళు. అలాంటి గొప్పవాళ్ళని సంస్మరించుకోవడం మన కనీస ధర్మం. భవిష్యత్ తరాలవారికి స్ఫూర్తి కావాలనే ఆలోచనతోనే ఘనచరిత్ర కలిగిన మహనీయుల విగ్రహాలను మనం బహిరంగ ప్రదేశాలలో పెట్టుకుంటున్నాం. ఇతర జిల్లాల నుండి వృత్తిరీత్యా నెల్లూరుజిల్లాకి వచ్చి పనిచేసే అధికారులకు ఈ జిల్లాకు చెందిన గోపాలరెడ్డి గారిని స్మరించుకోవాలన్న స్పృహ ఉండకపోవచ్చు. కనీసం నెల్లూరు జిల్లా నేతలకు కూడా ఆ ఆలోచన రాకపోవడం వారి కుసంస్కారానికి నిదర్శనం.

ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.

ఈ-మెయిల్
ప్రజావాణి
@
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## ఆన్‌లైన్ మోసాలతో జాగ్రత్త

ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు బాగా పెరిగిపోతున్నాయి. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంది కదా అని మురిసిపోవడం సంగతి అటుంచి, వాటిల్లో వచ్చే నకిలీ మెసేజ్‌లు పట్ల జాగ్రత్తగా ఉండకపోతే మన ఖాతాల్లో ఉన్న డబ్బంతా హుష్‌కాకీ... అయ్యే ప్రమాదం ఎంతైనా ఉంది. మన బ్యాంకు ఖాతా బ్లాక్ అయిపోతుందని, అది నిలుపుదల కాకుండా ఉండాలంటే కొంత సమాచారాన్ని లింక్ చేయాలని మెసేజ్ వస్తుంది. దానిని నమ్మి, ఆ మెసేజ్‌లోని లింక్‌ను ఓపెన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు, పాన్‌కార్డు, ఆధార్ నెంబరు ఇచ్చేస్తే... ఇక అంతే సంగతులు! మన బ్యాంకు ఖాతాలోని డబ్బు ఆన్‌లైన్ మోసగాళ్ల పరమైపోతుంది. ఏదేమైనా ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. మెసేజ్‌ల సంగతి అనుమానం వస్తే, వాటి జోలికిపోకుండా, అలాంటి మెసేజ్‌లను నమ్మవచ్చో లేదో సంబంధిత అధికారులను అడిగి నిర్ధారణ చేసుకోవాలి. స్మార్ట్‌ఫోన్ల మాయాజాలంలో పడి ఇలాంటి మెసేజ్‌లకు మోసపోకండి.

దినేష్ సింగ్, టి.పి.గూడూరు.

# మహనీయుల త్యాగాలతోనే.. దేశానికి స్వాతంత్ర్యం

## -- 76వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో మంత్రి అంబటి రాంబాబు --





ఎందరో మహానుభావుల పోరాటం, త్యాగం, కృషి ఫలితంగా 1947 ఆగస్టు 15వ తేదీన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అంబటి రాంబాబు అన్నారు. 76వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న నెల్లూరు లోని పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్‌బాబు, జిల్లా ఎస్పీ సి.హెచ్.విజయారావులతో కలసి మంత్రి అంబటి రాంబాబు జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసు వందనాన్ని స్వీకరించారు. మూడు రంగుల బెలూన్లను, శాంతి కపోతాన్ని ఎగురవేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ, అమరవీరులకు నివాళులు అర్పిస్తున్నానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి కోసం ఉన్నత లక్ష్యాలను సాధించడానికి 'నవరత్నాల' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. పేదల అభ్యున్నతి కోసం వైఎస్ఆర్ రైతు భరోసా, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ, 15 రకాల పింఛన్లు, పేదలందరికీ ఇళ్లు, వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ జలయజ్ఞం, మద్యపాన నిషేధం, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెనతో పాటు ఇతరత్రా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారని కొనియాడారు. పారదర్శకతతో కూడిన సుపరిపాలనలో భాగంగా శాస్త్ర సాంకేతిక సహాయంతో నూతన విధానాలను అనుసరిస్తూ గ్రామాలు, పట్టణాలు, ప్రజల సర్వతోముఖాభివృద్ధికి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు :

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నెల్లూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు, కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు, ఓవెల్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు, హిమాలయ ఇంగ్లీషు మీడియం హై స్కూల్ విద్యార్థులు, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, గొలగమూడిలోని బి.సి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు, ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు, నందిపాడు కెజిబివి విద్యార్థులు, గూడూరు ప్రభుత్వ గిరిజన పాఠశాల విద్యార్థులు, ఓజిలిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు, నెల్లూరు ప్రభుత్వ గిరిజన పాఠశాల విద్యార్థిని, విద్యార్థులచే దేశభక్తి ఉట్టిపడేలా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

ఈ ప్రదర్శనల్లో నెల్లూరు దర్గామిట్ట లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శనకు మొదటి బహుమతి, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శనకు రెండో బహుమతి, కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు, ఓజిలి ప్రభుత్వ గిరిజన పాఠశాల విద్యార్థుల ప్రదర్శనకు సంయుక్తంగా మూడో బహుమతి లభించగా, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మంత్రి అంబటి చేతులమీదుగా జ్ఞాపికలను అందచేశారు. ఈ సందర్భంగా ఉగ్రవాద ముష్కరులు ప్రజాప్రతినిధులను కిడ్నాప్ చేసినప్పుడు, పోలీసులు వారిని ఎలా విడిపించి ఉగ్రవాదులకు గుణపాఠం చెప్తారో కళ్ళకు కట్టినట్టుగా ప్రదర్శించిన దృశ్య రూపకం అందరినీ ఆకట్టుకుంది.

### ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు :

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేసి ఉత్తమ సేవలందిస్తున్న పలువురు అధికారులకు, ఉద్యోగస్తులకు మరియు స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులకు మొత్తంగా 604 మందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. పోలీసు శాఖకు సంబంధించి ఇద్దరికి ఉత్తమ సేవా పతకాలను, 12 మందికి పోలీసు సేవా పతకాలను, ఒకరికి కేంద్ర హోంశాఖమంత్రి మెడల్‌ను మంత్రి అంబటి రాంబాబు అందచేశారు. జిల్లాకు చెందిన పలువురు స్వాతంత్ర్య సమరయోధులు బొమ్ము శేషురెడ్డి, వేంద్రాతి అరుణాచలం, దేవరం శేషాద్రిరెడ్డి, భీమవరపు శేషయ్యనాయుడు, దేవరపాటి దయానందం, కొంకణాల రమణయ్య, స్వర్ణా వేమయ్య, పెరుకాటి వెంకారెడ్డి, గుడి పిచ్చమ్మ, గుడి పోలిరెడ్డి, కొల్లు రంగారెడ్డి కుటుంబ సభ్యులను సన్మానించి జ్ఞాపికలు అందచేశారు. ఈ వేడుకలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, కోవూరు, నెల్లూరు గ్రామీణ, ఆత్మకూరు ఎమ్మెల్యేలు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, జేసీ కూర్మనాథ్, నగర కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత, అడిషనల్ ఎస్పీలు హిమవతి, చౌడేశ్వరి, జి.శ్రీనివాసరావు, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ అనేక పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విశేష సేవలకు.. విశిష్ట గుర్తింపు

## రాష్ట్ర ప్రభుత్వం నుంచి శ్రీసిటీ ఎం.డి రవీంద్రసన్నారెడ్డికి ప్రత్యేక ప్రతిభా అవార్డు




Azadi Ka Amrit Mahotsav
INDEPENDENCE DAY CELEBRATIONS
Tirupati District
Award
PRESENTED TO
Sri Dr. Ravindra Sanna Reddy
Founder & Managing Director
Sri City, Tirupati District, Andhra Pradesh
For His Unique Aptitude in Industrialization in Tirupati District.
K. Venkata Ramana Reddy, I.A.S.
Collector & District Magistrate
Tirupati District

పారిశ్రామిక రంగంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చేస్తున్న విశేష సేవలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి విశిష్ట గుర్తింపు లభించింది. పరిశ్రమలు బొత్తిగా కరువై, పారిశ్రామికరంగంలో ఎంతో వెనుకబడిన నెల్లూరు జిల్లాలోని తడ ప్రాంతం (ఇప్పుడు తిరుపతి జిల్లా)లో ఒకటొకటిగా పరిశ్రమలు స్థాపిస్తూ, నేడు అంతర్జాతీయ స్థాయిలో దేశ విదేశీ పరిశ్రమలకు నెలవుగా శ్రీసిటీని రూపొందించారు.. రవీంద్ర సన్నారెడ్డి.

నేడు దేశంలోనే అపురూపమైన పారిశ్రామికవాడగా శ్రీసిటీకి పేరు తెచ్చి, పెద్దపెద్ద పరిశ్రమలకు సైతం పెద్దపీట వేస్తూ, ఎప్పటికప్పుడు శ్రీసిటీని పురోగామిపథంలో పయనింపజేస్తున్న నిరంతర పారిశ్రామిక కృషీవలుడు.. రవీంద్ర సన్నారెడ్డి. ఎంతో కాలంగా ఆయన చేస్తున్న పారిశ్రామిక సేవలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ అమృతోత్సవాల శుభవేళ, ఆగస్టు 15వ తేదీన తిరుపతిలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఆయనకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అవార్డును అందజేయడం సంతోషకరం. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చేతుల మీదుగా రవీంద్ర సన్నారెడ్డి ఆ అవార్డును అందుకున్నారు. జిల్లా పారిశ్రామికీకరణలో రవీంద్ర సన్నారెడ్డి చూపుతున్న ప్రతిభకు గుర్తింపుగా ఆయనకు ఈ అవార్డు లభించింది. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పరమేశ్వరరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తనకు ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డును ప్రదానం చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా యంత్రాంగానికి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా తన కృతజ్ఞతలు తెలిపారు.

# 'తంగిరాల మహాభారతం'

## 17వ భాగం




వైశంపాయనుడు జనమేజయ మహారాజుకి భరత వంశం గురించి చెపుతాడు. హస్తి అనే మహారాజు వలన రాజధానికి హస్తినాపురం అనే పేరు వస్తుంది. కురు మహారాజు వలన కురు వంశం అభివృద్ధి చెందుతుంది. ఆ వంశంలో చెప్పుకోదగిన మహారాజు ప్రతీపుడు. అతని భార్య సునందాదేవి. వారి కుమారుడు శంతనుడు. ఆ పేరు ఎందుకు వచ్చిందంటే శంతనుడు, ఎవరైనా రోగులని ముట్టుకుంటే ఆ రోగాలు పోతాయి. ముసలివాళ్ళను ముట్టుకుంటే యవ్వనం వస్తుంది. బ్రహ్మదేవుని శాపంగా గంగ విషయంలో పూర్వ కాలంలో చాలా అశ్వమేధయాగాలు, యాగాలు చేసిన మహాభిషుడు అనే గొప్ప మహారాజు శంతనుడిగా పుడతాడు.

శంతన మహారాజు ఒకరోజు గంగా తీరానికి వచ్చినప్పుడు గంగని చూసి ఇష్ట పడతాడు, కానీ తన తండ్రి చెప్పిన ప్రకారం ఆమెని ఏమీ అడగకుండా ఆమె పెట్టిన షరతులకు ఒప్పుకుని, ఆమెని పెళ్లి చేసుకుంటాడు. కొన్నాళ్లకి ఒక కొడుకు పుడతాడు. గంగ ఆ పిల్లవాణ్ణి గంగలో పారవేస్తుంది. అడిగితే ఎక్కడ వెళ్లిపోతుందో అని భయపడి మాట్లాడకుండా ఊరుకుంటాడు. ఆలా ఇంకో 6 గురు పిల్లల్ని గంగలో పారవేస్తుంది. అయినా శంతనుడు ఏమీ మాట్లాడడు. 8వ కొడుకు పుట్టగానే గంగని అడ్డుకుని, ఎందుకిలా చేస్తున్నావని పరుషంగా మాట్లాడతాడు. అప్పుడు గంగ వసిష్ఠుడు అష్ట వసువులకిచ్చిన శాపం గురించి చెపుతుంది.

అష్ట వసువులు వసిష్ఠ మహాముని కామధేనువుని దొంగిలించగా, వసిష్ఠుడు కోపంతో వారు మానవలోకంలో పుట్టాలని శపిస్తాడు, కానీ ఎవరైతే దొంగతనం చేశాడో, అతను అక్కడే చిరకాలం జీవిస్తాడని, సంతానం కలగదని చెపుతాడు. వసువులు బ్రతిమిలాడితే, అక్కడ పుట్టాక మిగతా వసువులకి శాప విముక్తి అవుతుందని వారికి ఉపశమనమిస్తాడు. అష్ట వసువులు గంగని కోరుతారు, ఆమె గర్భంలో పుడతామని, పుట్టగానే వాళ్ళని గంగలో పారవెయ్యమని. అప్పుడు గంగ 8వ కుమారుణ్ణి మాత్రం తనకియ్యమని అడుగుతుంది. గంగ శంతనునికి, అలా వసువుల శాపం గురించి చెప్పి, ఈ పిల్లవాణ్ణి కొన్ని రోజులు తానే పెంచి ఇస్తానని నచ్చచెప్పి, పిల్లాడితో మాయమవుతుంది. ఆ పిల్లవాడే భీష్ముడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam
@YouTubeలో చూడగలరు.



నెల్లూరు కబుర్లు

## పశుసంవర్ధక శాఖలో..
# ఆరుగురికి అవార్డులు



ఆజాదీ కా అమృత్ మహోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న ఆరుగురు అధికారులకు అవార్డులు లభించాయి. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.మహేశ్వరుడు, కందుకూరు ఉప సంచాలకులు డాక్టర్ కెసిహెచ్‌వి చంద్రశేఖర్, ఆత్మకూరు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్ జయచంద్ర, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఏ.రామచంద్రారెడ్డి, పెనుబల్లి గ్రామీణ పశు వైద్యశాల లైవ్‌స్టాక్ అధికారి ఆర్.శ్రీనివాసులు, బుచ్చి మండలంలోని పురంధరపురం ఆర్బీకె పశుసంవర్ధకశాఖ సచివాలయ ఉద్యోగి మనోజ్ కుమార్‌లు అవార్డులు అందుకున్నారు. విజయవాడలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ అప్పలరాజు వారికి అవార్డులను బహుకరించారు.

## స్వాతంత్ర్యవేడుకల్లో.. ఎమ్మెల్యే ప్రసన్న



నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఆగస్టు 15న జరిగిన 76వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు రాష్ట్ర ఆప్కోఫ్ ఛైర్మెన్ కొండూరు అనిల్‌బాబు, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగా రెడ్డి, నాయకులు వీరి చలపతిరావు, ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి, జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ జయలక్ష్మి, బుచ్చి నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కోవూరు జడ్పీటిసి శ్రీలత, ప్రవల్లిక తదితరులున్నారు.

## 56 ఏళ్ళనాటి.. అపూర్వ ఆత్మీయ కలయిక
### విఆర్ ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం



1962-1966 సంవత్సరాల్లో విఆర్ ఉన్నత పాఠశాలలో 12వ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు 56 సంవత్సరాల తర్వాత ఆత్మీయంగా కలుసుకుని ఒకరికొకరు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని పులకించిపోయారు. నెల్లూరులోని టివిఎస్ కల్యాణసదన్‌లో ఇటీవల వారు నిర్వహించుకున్న ఈ సమావేశం ఎంతో అభిమానంగా.. స్నేహ పూర్వకంగా జరిగింది. ఇప్పుడు ఎక్కడో ఉద్యోగాలు, ఉన్నతస్థానాల్లో ఉన్నవారంతా కలుసుకుని ఆత్మీయతను పంచుకున్నారు. ఇంతకాలంగా ఎవరెవరు ఎక్కడెక్కడ ఎలా ఉన్నారో, వారి పిల్లలు ఎలా ఉన్నారో ఒకరి నొకరు అడిగి తెలుసుకుని ఆనందించారు. పూర్వ విద్యార్థులు రసూల్ అహ్మద్, ఆమంచర్ల చంద్రశేఖర్, రవిసుందర్‌రాజన్, కృష్ణయ్య, పెనుమల్లి మధు, పుట్టా శేషారెడ్డి, రవీంద్రనాథ్, ప్రభాకర్, ముస్తాక్ అహ్మద్, బాలసుబ్రహ్మణ్యం, భాస్కర్, దశరథరామయ్య, వాసుదేవన్, సీతారామ మూర్తి, మల్లికార్జున, అమర్‌నాథ్‌రెడ్డి సుంకు రామ్మోహన్, పత్తి రవీంద్ర బాబు, రఘునాథరెడ్డి, సత్య నారాయణ, వెంకటరామిరెడ్డి, సాయిప్రకాష్, వెంకటేశ్వర్లు, భక్తవత్సలరెడ్డి, భవానీశంకర్, విజయభాస్కర్‌రెడ్డి, విజయ కుమార్‌రెడ్డి తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు






# సర్వత్రా మువ్వన్నెల జెండా రెపరెపలు

ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు, హర్ ఘర్ తిరంగా(ప్రతి ఇంటా త్రివర్ణ పతాక) కార్యక్రమాలతో నెల్లూరంతా సందడిగా మారింది. సర్వత్రా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. దేశభక్తి నినాదాలు, పాటలు, భారీ పతాకాల ప్రదర్శనలు, ర్యాలీలతో ఎక్కడ చూసినా దేశభక్తి ఉప్పొంగింది. ప్రత్యేకించి నెల్లూరు నగరంలో విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు దేశభక్తి కార్యక్రమాలతో కళకళలాడాయి. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 వసంతాలు పూర్తయి ఈ ఆగస్టు 15న జరిగిన 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంబరాన్నంటేంత సంబరాన్ని కలిగించాయి.

## విశ్వసాయిలో...



నేటి బాలలే రేపటి పౌరులని, ప్రతి ఒక్క విద్యార్థి క్రమశిక్షణతో, కృషి-పట్టుదలతో చదువుకుని విద్యలో రాణించి సమాజానికి, దేశ అభ్యున్నతికి ఉపయోగపడాలని నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని 'విశ్వసాయి' జూనియర్ కళాశాల ఛైర్మెన్ డా.ఎన్ సత్య నారాయణ, వైస్ ఛైర్మెన్ కృష్ణ మోహన్ అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవాలను పురస్కరించుకుని కళాశాలలో సంబరాలు జరిగాయి. ఆగస్టు 15న 76వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా జాతీయపతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. అనంతరం వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, ఎంతోమంది స్వాతంత్ర్యయోధుల త్యాగాల ఫలితంగా మనదేశానికి స్వాతంత్ర్యం లభించిందని, ఆ విషయం గుర్తుంచుకుని ప్రతి విద్యార్థి శ్రద్ధాసక్తులతో చదువుకుని, అందరూ ఒకరినొకరు గౌరవించుకుంటూ, దేశభక్తితో మెలగాలన్నారు. ప్రతి విద్యార్థి దృఢ సంకల్పంతో మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని, లక్ష్యసాధనకు కృషిచేయాలని చెప్పారు. అనంతరం 'వందేమాతరం' నినాదాలతో కళాశాల మార్మోగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విజయ డెయిరీలో..




నెల్లూరు వెంకటేశ్వరపురంలోని విజయ డైయిరీలో ఆగస్టు 15న 76వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్య స్ఫూర్తితో ప్రతి ఒక్కరు నిరంతరం కష్టపడి కో-ఆపరేటివ్ రంగంలో ఉన్న విజయ డెయిరీ అభివృద్ధికి కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఎటి కృష్ణమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో...




ఆగస్టు 15 స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ నెల్లూరు జిల్లా కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనసేన జిల్లా అధ్యక్షులు చెన్నారెడ్డి మనుక్రాంత్ స్థానిక శ్రీహరినగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల స్ఫూర్తితో ప్రజలందరూ సమసమాజ స్థాపనకు కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా అన్నారు. జనసేన నగర అధ్యక్షుడు సుజయ్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, రాష్ట్ర కార్యదర్శి కొట్టె వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు సుధీర్ బద్దిపూడి, జిల్లా అధికార ప్రతినిధి కలువాయి సుధీర్, నగర కార్యదర్శి ఉమాదేవి తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## 'విపిఆర్ విద్య'లో..

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను పురస్కరించుకుని ఆగస్టు 15న 76వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాజ్యసభ సభ్యులు, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'విపిఆర్ ఫౌండేషన్' ద్వారా నిర్వహిస్తున్న ఆ పాఠశాలలో స్వాతంత్ర్యదినోత్సవ సంబరాలు వెల్లివిరిశాయి. విపిఆర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, టిటిడి ఉత్తరభారతదేశ ఆలయాల అడ్వయిజరీ కమిటీ ఛైర్‌పర్సన్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డి పాల్గొని జెండా వందనం చేశారు. పాఠశాల విద్యార్థులందరూ దేశభక్తి గీతాలను ఆలపించి, మార్చ్‌ఫాస్ట్ చేశారు. బ్రిటీష్ పాలకుల దౌష్ట్యాలను ఎదిరించి, దేశానికి బానిసత్వం నుంచి విముక్తి కలిగించేందుకు ఎన్నో త్యాగాలు చేశారని ఆమె అంటూ, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఎందరో వీరుల ప్రాణత్యాగాలను ఈ సందర్భంగా విద్యార్థులకు గుర్తుచేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దేశభక్తి గీతాలకు నృత్యాలు చేశారు. సైనికుల వీరత్వాన్ని చాటుతూ నాటికలను ప్రదర్శించారు. విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ఆచార్య వి.నారాయణరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.హెచ్ కళ పాల్గొన్నారు.

## డిసిసి ఆధ్వర్యంలో..



ఆగస్టు 15న స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా నెల్లూరులోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా భవన్‌లో జిల్లా అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి జాతీయపతాకాన్ని ఆవిష్కరించి 76వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వతంత్రం కోసం పోరాడిన సమర యోధులందరూ, నాయకులందరూ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వాళ్ళేనని, జాతీయపతాకాన్ని మొట్టమొదటిగా ఆవిష్కరించింది కూడా కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. అనంతరం అందరికీ చాక్లెట్లు, స్వీట్లు, జెండాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు కె.వి.చలమయ్యను దేవకుమార్‌రెడ్డి సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు ఉడతా వెంకట్రావుయాదవ్, సురేష్‌బాబు, బాలసుధాకర్, ఏటూరి శ్రీనివాసులరెడ్డి, ఫయాజ్, గణేష్‌బాబు, అల్లా వుద్దీన్, మోహన్‌రెడ్డి, హుస్సేన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## 'పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం'.. పుస్తకావిష్కరణ



నెల్లూరుకు చెందిన ప్రముఖ పాత్రికేయుడు, కవి ఈతకోట సుబ్బారావు రచించిన 'పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం' పుస్తకాన్ని ఆజాదీకా అమృత్ మహోత్సవం సందర్భంగా ఈ నెల 13న ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షులు పి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు.

# జగన్.. శాశ్వత ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకున్నాం

## - రొట్టెల పండుగలో వేమిరెడ్డి దంపతులు

రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డితో కలసి ఈనెల 13న నెల్లూరు బారాషహీద్ దర్గాలో వైభవంగా జరుగుతున్న రొట్టెల పండగలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ, బారాషహీద్ దర్గా వద్దనున్న స్వర్ణాల చెరువులో ప్రతి ఏడాది కులమతాలకు అతీతంగా నిర్వహించే రొట్టెల పండుగలో పాల్గొనడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక్కడకు వచ్చి రొట్టెలు పట్టుకొంటే కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసమని, దేశంలోని వివిధ రాష్ట్రాలనుండే కాకుండా విదేశాల నుండి సైతం భక్తులు ఇక్కడకు వస్తుండడం విశేషమని ఆయన చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటూ తాము రొట్టెను వదలడం జరిగిందని ఆయన తెలిపారు. రొట్టెల పండుగ ప్రాముఖ్యతను గుర్తించి బారాషహీద్ దర్గా అభివృద్ధి మరియు మౌలికవసతుల కోసం రూ.15 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన తన ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి సంవత్సరం పెరుగుతున్న భక్తుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను దగ్గరుండి ఏర్పాటుచేసిన స్థానిక శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, మేయర్‌కు, కోటంరెడ్డి



గిరిధర్‌రెడ్డికి, మిగతా ఎమ్మెల్యేలకు, జిల్లా కలెక్టర్, ఎస్పీలకు, మునిసిపల్ కమిషనర్‌కు, స్థానిక కార్పొరేటర్లు మరియు ఇతర అధికారులందరికీ అభినందనలని పేర్కొన్నారు.

### ప్రతి భారతీయునిలో స్ఫూర్తిని కలిగిస్తున్న..

## 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'

ఈ ఏడాది స్వాతంత్ర్య సంబరాలు దేశమంతా ప్రత్యేక పండగ వాతావరణాన్ని తెచ్చాయని, ఆజాదీకా అమృత్ మహోత్సవ్ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రతి భారతీయుడిలోనూ దేశభక్తి స్ఫూర్తిని రగిలిస్తున్నాయని, హర్ ఘర్ తిరంగా కార్యక్రమంతో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా దేశమంతా త్రివర్ణ పతాకాలతో కళకళలాడుతోందని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం ఈ ఆగస్టు 15వ తేదీ నుంచి 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని ప్రారంభిస్తుండటం ఆనందదాయకమని తెలిపారు. ఇకపై ప్రతి ప్రభుత్వ వైద్యాధికారి క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించబోతున్నారని, ప్రతి క్షణం జనం కోసం తపించే ఉత్సాహవంతమైన యువనేత ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ ప్రజల అదృష్టంగా భావిస్తున్నానని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# శ్రీసిటీలో ఘనంగా.. 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆగస్టు 15న 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శ్రీసిటీలో ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్ ప్రాంగణం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.రత్నకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జెండా వందనం చేశారు. పారిశ్రామికవాడ సంరక్షణలో శ్రీసిటీ భద్రతా బృందాలు పోషిస్తున్న విశేషమైన పాత్ర గురించి శ్రీసిటీ సెక్యురిటీ విభాగం సీనియర్ మేనేజర్ వై.రమేష్ ముఖ్యఅతిథికి వివరించి, భద్రతా అధికారులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'ను పురస్కరించుకుని స్వాతంత్ర్య సమరయోధులందరికీ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రత్నకుమారి మాట్లాడుతూ, సుమారు పన్నెండేళ్ల క్రితం తాను ఎస్వీ యూనివర్సిటీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నప్పుడు శ్రీసిటీ ప్రాంత ఆర్థిక ప్రగతిపై సర్వే చేశానని, శ్రీసిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఈ ప్రాంత అభివృద్ధిని శ్రీసిటీ ఎంతగానో ప్రభావితం చేసిందన్న ఆమె, స్థిరమైన పట్టణీకరణ సూత్రాల పట్ల నిబద్ధత, చక్కని అమలు, నిర్వహణతో వెనుకబడిన ప్రాంతంలో ఉద్యోగాల కల్పనకు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చేసిన కృషి ప్రశంసనీయమని కొనియాడారు.

ఈ సందర్భంగా తమ విధుల్లో విశేష సేవలకు గుర్తింపుగా 21 మంది సెక్యూరిటీ గార్డులకు, హౌస్‌కీపింగ్, ల్యాండ్‌స్కేపింగ్ విభాగాలకు చెందిన మరో 10మందికి, ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లకు ముఖ్యఅతిథి, శ్రీసిటీ ఎండీ, ఇతర ప్రముఖులు 'ఉత్తమ పనితీరు' అవార్డులను అందజేశారు. ఆ తర్వాత కోలాటం, నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన మల్లవారిపాలెంకు చెందిన పలువురు మహిళలు మరియు వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను శ్రీసిటీ ఎం.డీ అభినందించి, వారికి నగదు పురస్కారాలను అందజేశారు. విదేశాల్లో స్థిరపడ్డ భారతీయులు హరనాథ్, రమేష్, శ్రీసిటీ డీఎస్పీ జగదీష్ నాయక్, పరిశ్రమలకు చెందిన పలువురు ప్రముఖులు, చుట్టుపక్కల గ్రామాలలోని పలువురు ఉద్యోగులు, ప్రజలు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీసిటీ సెజ్ డెవలప్మెంట్ కమిషనర్ కార్యాలయం, హెచ్ఆర్డీ అకాడమీ, ట్రిపుల్ ఐటీ, క్రియా యూనివర్సిటీ, శ్రీసిటీ చిన్మయ విద్యాలయ, శ్రీసిటీ పరిసరాల్లోని 17 ప్రభుత్వ పాఠశాలలు, 14 అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.



## ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా..శ్రీసిటీ

### - ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రసంగంలో శ్రీసిటీ పారిశ్రామిక కమ్యూనిటీకి 76వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ సమర్ధవంతమైన నాయకత్వంలో పనిచేస్తూ 'ఆత్మనిర్భర్ భారత్' దిశగా 'మేక్ ఇన్ ఇండియా', 'మేక్ ఫర్ వరల్డ్' ప్రణాళికలకు అనుగుణంగా ప్రపంచానికి సేవలందిస్తూ దేశం సత్తా చాటుతున్నాయన్నారు. ఉత్పాదక కేంద్రంగా మారడం, ఉద్యోగాల కల్పనకు ఉత్తేజాన్ని ఇవ్వడం, ఆర్థిక వ్యవస్థను వేగవంతమైన మార్గంలోకి తీసుకెళ్లడం వంటి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా శ్రీసిటీ తనవంతు కృషి చేస్తోందన్నారు. ఈ వేడుకల్లో చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు, చిన్నారులు చురుగ్గా పాల్గొనడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.



# ఆనం ఇంట.. జెండా పండుగ సంబరాలు

మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి నివాసం ఆజాదీ కా అమృత్ ఉత్సవాలకు వేదికైంది. 'హర్ ఘర్ తిరంగా' వేడుకల్లో భాగంగా మూడు రోజుల కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. తొలి రోజైన శనివారం నెల్లూరులోని ఆయన నివాసంలో వందలాది మంది విద్యార్థులతో కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలను చేతబట్టి 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేసి జాతి ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. అలాగే దేశభక్తి గీతాలకు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆనం సోదరులు ఒకే వేదికపైకి వచ్చి సందడి చేశారు. ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, ప్రజల్లో రాజ్యాంగ స్ఫూర్తిని కలిగించేందుకు ప్రధాని మోడీ, సిఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. రామనారాయణరెడ్డితో పాటు ఆయన సోదరులు ఆనం జయకుమార్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ సోదరుడు ఆనం వివేకానందరెడ్డి లేని లోటు ఎన్నిటికీ తీర్చలేనిదని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని రామనారాయణరెడ్డి ప్రారంభించగా, విజయకుమార్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రత్యేక అతిథిగా జయకుమార్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు 'హర్ ఘర్ తిరంగా' కిట్లు, జ్ఞాపికలు అందజేశారు.

### స్వాతంత్ర్యయోధుల స్ఫూర్తితో..


# దేశ ఔన్నత్యాన్ని చాటాలి

### - కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు



దేశ స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన ఎందరో స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను, ఆదర్శాలను, వారి స్ఫూర్తిని పుణికిపుచ్చుకుని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలు, విధులను సమర్థవంతంగా నిర్వహించి, తాము ఏ రంగంలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా, మన దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు పిలుపునిచ్చారు. 76వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 15న కలెక్టరేట్‌లో వంద అడుగుల జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఆవిష్కరించి జెండాకు వందనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత 15 రోజులుగా జిల్లావ్యాప్తంగా ప్రజలు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారని, జిల్లాలోని 8 లక్షల ఇళ్లపై, అన్ని దుకాణాలు, వాహనాలపై జాతీయ జెండాను ప్రజలు రెపరెపలాడించి జాతీయ జెండా గొప్పతనాన్ని, ఐక్యతా భావాన్ని ప్రదర్శించారన్నారు. మువ్వన్నెల జెండాతో దిగిన ఫోటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో దేశంలోనే మన జిల్లా ముందువరుసలో నిలవడం గర్వకారణమన్నారు. తొలుత కలెక్టరేట్‌లోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, డెప్యూటీ ట్రైనీ కలెక్టర్ ఏ.మహేష్, డిఆర్డిఏ పీడీ సాంబశివారెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వెంకటేశ్వర ప్రసాద్, ఉపాధి కల్పనాధికారి సురేష్, ఏఓ షఫీమాలిక్ తదితరులు పాల్గొన్నారు.



# సింధు - సిద్ధార్థ

'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు, కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి శిష్యరికంలో జర్నలిజంలో ఓనమాలు నేర్చుకుని 'లాయర్' పత్రికలో సుదీర్ఘకాలం పనిచేసి ప్రస్తుతం సాక్షి దినపత్రిక చెన్నై బ్యూరో ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్న కొ్ట్రా నందగోపాల్ - పుష్పలతల కుమార్తె **అఖిలసింధు జ్వాలిని - నాగవెంకట సిద్ధార్థ** (ఒంగోలు వాస్తవ్యులు రామసుబ్బారావు - పద్మినిల కుమారుడు)ల కళ్యాణ వేడుక ఆగస్టు 10వతేదీ చెన్నైలో జరిగింది.

ప్రముఖ వైద్యులు ఆచార్య సి.యం.కె.రెడ్డి, పారిశ్రామికవేత్తలు 'కెన్సెన్' నరసారెడ్డి, కొడవలూరు సుబ్బారెడ్డి, ముఖ్యమంత్రి జగన్ పెదనాన్న కుమారుడు వై.యస్.అనిల్‌రెడ్డి, ప్రముఖ ఆడిటర్ జె.కె.రెడ్డి, సినీనటి సీతతో పాటు అనేక మంది రాజకీయ, పారిశ్రామిక, సినీ ప్రముఖులు ఈ పెళ్ళి సంబరంలో పాల్గొని కొత్త దంపతులను దీవించారు.

సింధు - సిద్ధార్థలకు 'లాయర్' శుభదీవెనలు.







## కళ్యాణ వైభోగం...!



మాజీ ఎమ్మెల్సీ మరియు మాజీ జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి - కవితల కుమార్తె **డాక్టర్ వినతి - డాక్టర్ సాయి కృష్ణ** (బెంగళూరు వాస్తవ్యులు కె.వి.ఎస్.రెడ్డి - గౌరిల కుమారుడు)ల వివాహం ఆగస్టు 11వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పారిశ్రామికవేత్తలు, పలువురు ప్రముఖులు పాల్గొని కొత్త జంటను ఆశీర్వదించారు. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



హైదరాబాద్ వాస్తవ్యులు కొండా వెంకటప్రసాద్ - ఉషాపద్మల కుమార్తె **వెంకట నాగలక్ష్మి శ్రావ్య - శేషసాయి చరణ్**(ప్రకాశం జిల్లా, పొదిలి వాస్తవ్యులు ఒగ్గు లక్ష్మీనరసింహారావు - పుష్పలతల కుమారుడు)ల పరిణయం ఆగస్టు 11వ తేదీ సికింద్రాబాద్‌లో వైభవంగా జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# 'నెల్‌క్యాస్ట్'లో తిరంగా పండుగ



75 వసంతాల స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకుని దేశం మొత్తం నిర్వహిస్తున్న 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల నెల్‌క్యాస్ లిమిటెడ్ మరియు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో నెల్‌క్యాస్ట్ ఆవరణంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు పరిసర ప్రాంతాల వాలంటీర్ల ద్వారా 1000 ఇళ్ళకు జాతీయ జెండాలను అందివ్వడం జరిగిందని నెల్‌క్యాస్ట్ పరిశ్రమ వైస్‌ప్రెసిడెంట్ ఎన్.ఎస్.రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రొటేరియన్లు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామ్మోహన్‌రావు, రోటరీక్లబ్ వెస్ట్ ప్రెసిడెంట్ ధనంజయరెడ్డి, కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, నెల్‌క్యాస్ట్ తరుపున వెంకటేశన్, దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి, టి.మురళీకృష్ణ, కంపెనీ పీఆర్‌ఓ ఆనిమెళ్ళ శివకుమార్, రొటేరియన్స్ నాశిన నాగులు, బొమ్మిడి శ్రీనివాసులు, బి.శ్రీకాంత్‌రెడ్డి, వాసుగౌడ్, సుబ్రమణ్యం పాల్గొని జాతీయజెండాలను పంపిణీచేశారు. చవటపాలెం మరియు డానియోలు చిల్డ్రన్స్ స్కూల్ పిల్లలకు వ్యాసరచన, క్విజ్‌పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. చవటపాలెం స్కూలులో 100 చెట్లను నాటారు.

# జెండాలు పంచిన ఎస్.వి.రత్నం చారిటీస్



ఆజాదీ కా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా గూడూరు పట్టణంలోని మాళవ్యనగర్ సెంటర్లో ఎస్.వి.రత్నం చారిటీస్ మరియు బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఇంటింటికీ జెండా వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వరప్రసాద్, ఎస్.వి.రత్నం చారిటీస్ అధినేత శ్రీకంటి రామ్మోహన్‌రావు - రాజ్యలక్ష్మి దంపతులు, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, కల్పలత, బ్రాహ్మణ సంఘాల నాయకులు ఆనిమెళ్ళ శివకుమార్, చిట్టమూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.





ఆగస్టు 15వ తేదీన తిరుపతి జిల్లాలో జరిగిన 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డిల సమక్షంలో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి చేతుల మీదుగా అవార్డులనందుకుంటున్న గూడూరు రూరల్ సి.ఐ శ్రీనివాసులురెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ ఆర్.వెంకటేశ్వరరాజు.





ఆగస్టు 15వ తేదీ నెల్లూరులో జరిగిన 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు, ఎస్పీ విజయారావు సమక్షంలో మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నెల్లూరు ట్రాఫిక్ సి.ఐ నాగేశ్వరమ్మ, గూడూరు జెవివి ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్.



## కండలేరు రిజర్వాయర్‌ను పరిశీలించిన మంత్రులు

సమగ్ర సోమశిల ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన కండలేరు రిజర్వాయర్‌ను ఈనెల 14న రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిలు మాజీమంత్రి.. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డితో కలసి పరిశీలించారు. చెన్నై త్రాగునీటి సరఫరాకు నీటి విడుదల సిస్టమ్‌ను పరిశీలించిన తర్వాత సంబంధిత ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో సమావేశమై పనులను సమీక్షించారు. ఎస్ ఎస్ కెనాల్ పనులను యధావిధిగా ప్రారంభించే దిశగా అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా 23ఏళ్ళ క్రితం.. 1999 సంవత్సరంలో స్థానిక రైతాంగ సాగునీటి హక్కుల సాధన కోసం అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న తాను ఆమరణ నిరాహారదీక్షకు పూనుకున్న జ్ఞాపకాలను, తద్వారా.. అన్ని ప్రాంతాలకు బ్రాంచ్ కాలువల నిర్మాణం కోసం దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్వయంగా అందించిన సహకారాన్ని రామనారాయణరెడ్డి వివరించారు.

## వైఎస్సార్ జీవిత చరిత్రను.. పాఠ్యాంశంగా చేర్చాలి

### మంత్రి అంబటిని కలసి విన్నవించిన చిన్నారి కార్తీక



సంక్షేమ పథకాల ప్రదాత, మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవిత చరిత్రను ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ స్కూల్ సిలబస్‌లో ఒక పాఠ్యాంశంగా పొందుపరచాలని నెల్లూరుజిల్లాకు చెందిన 9వ తరగతి విద్యార్థిని జివి కార్తీక ఇటీవల నెల్లూరుకు వచ్చిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు వినతిపత్రం సమర్పించింది. ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలందించిన డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మహనీయమైన జీవిత చరిత్ర భావి తరాల వారికి తెలియపరచడం ఎంతో అవసరమని ఆ చిన్నారి పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలించి ప్రైమరీ స్కూల్స్ సిలబస్‌లో వైఎస్ జీవిత చరిత్రను ఒక పాఠ్యాంశంగా ముద్రించాలని కోరింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఎన్నో అద్భుతమైన పథకాలను నేటికీ కొనసాగిస్తూ ఉందని సంతోషపడుతూ, వైఎస్సార్ అమలులోకి తెచ్చిన ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత కరెంటు, డ్వాక్రా రుణాలు, 108,104 సేవల తదితర పథకాలు దేశంలో కొన్ని రాష్ట్రాలలో ఇప్పటికీ అమలుపరచడం లేదని ఆ చిన్నారి ఆవేదన వ్యక్తం చేసింది. సంక్షేమ పథకాల స్ఫూర్తి ప్రదాత డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి అని, ఆయన అడుగుజాడలలో నడుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రమం తప్పకుండా సామాన్య ప్రజలకు, బడుగు బలహీనవర్గాల వారికి అత్యున్నతమైన తోడ్పాటు నందిస్తూ కొన్ని వేల కోట్ల రూపాయలను సంక్షేమ పథకాల కోసం నేరుగా ప్రజలకు అందించడమనేది దేశంలో మరెక్కడా లేనటువంటి అత్యున్నతమైన కార్యక్రమమని కొనియాడింది.

### తెలుగుజాతి ఖ్యాతిని

## దశదిశలా చాటిన.. మహానేత ఎన్టీఆర్

### శతజయంతి సభలో కొనియాడిన మాజీమంత్రి సోమిరెడ్డి



తెలుగు జాతిని, తెలుగు ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత నాయకుడు నందమూరి తారక రామారావు అని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేశారని, ఆయన సేవలు అందరికీ మార్గదర్శకమని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొనియాడారు. స్థానిక పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలలో భాగంగా 'ఎన్టీఆర్ కళారత్న' అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటునిగా సినిమా రంగంలో నెంబర్-1 అనిపించుకుని, ఆ తర్వాత ఎటువంటి రాజకీయ అనుభవం కానీ, రాజకీయ చరిత్ర కానీ లేకపోయినా తెలుగుదేశం పార్టీ స్థాపించి, ప్రజల అండదండలతో తొమ్మిది నెలల్లోనే ముఖ్యమంత్రిగా పీఠం అధిష్ఠించి ఎన్టీఆర్ చరిత్ర సృష్టించారన్నారు. పేదల కోసం రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం, వృద్ధులకు పింఛన్, పక్కాగృహాలు లాంటివే కాకుండా మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన మహోన్నత నేత ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. నేటి కళాకారులకు, రాజకీయ నాయకులకు ఎన్టీఆర్ ఆదర్శమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మేయర్, టిడిపి జిల్లా పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్ అన్నారు. ఈ సందర్భంగా పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలు మునిచంద్ర(సినీనటులు), టి.జయకుమార్(సినీ దర్శకులు), ఉన్నం వెంకటేశ్వర్లు (రచయిత), ఎన్.విజయలక్ష్మి (రచయిత్రి), బత్తిని నరసింహులుగౌడ్ (సమాజసేవకులు), పి.ప్రసన్న ఆంజనేయులు రాజు(స్వచ్ఛంద సేవకులు), ఎమ్.డి.గౌస్ భాషా (సినీనటులు), జాను (సినీనటి), మిధున ప్రియ (సినీనటి)లను వారు ఘనంగా సత్కరించారు. టిడిపి నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, పి.ఎల్.రావు, ఊరందూరు సురేంద్రబాబు, వై.చంద్రశేఖర్‌రెడ్డి, నన్నే సాహెబ్, రవి గోగులపల్లి, జెన్ని రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..స్వాతంత్ర్య వేడుకలు



ఆగస్టు 15న 76వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ ఛైర్‌పర్సన్ దొంతు శారద జాతీయ పతాక ఆవిష్కరణ చేసి, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరుల గురించి ప్రసంగించారు. తదుపరి అందరికీ స్వీట్స్ పంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కె. కుమార్‌రాజా, డెప్యూటీ లైబ్రేరియన్ సి.హెచ్.ప్రసాద్, కేంద్ర గ్రంథాలయ సిబ్బందితో పాటు పాఠకులు పాల్గొన్నారు. అనంతరం ఆజాది కా అమృత్ మహోత్సవం వేడుకలో భాగంగా నగరంలోని గాంధీబొమ్మ దగ్గర ఉన్న దొడ్ల పద్మావతమ్మ శాఖా గ్రంథాలయంలో ఆమె మొక్కను నాటారు.

## ఆత్మకూరులో..కాంగ్రెస్ గౌరవ యాత్ర



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు పూర్తయి 76వ ఏట అడుగుపెట్టిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మకూరులో ఆగస్టు 15న మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించి 'ఆజాదీ కా గౌరవ్ యాత్ర'ను భారీ ర్యాలీగా నిర్వహించారు. ఆత్మకూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చేవూరు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఇతర కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ బస్టాండ్ వద్ద డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి, రాజీవ్‌గాంధీ, వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని బైపాస్ రోడ్ సెంటర్ నుండి సత్రం సెంటర్, ప్రధాన బజారుసెంటర్, మున్సిపల్ బస్టాండ్, బిఎస్ఆర్ సెంటర్. పోలీస్‌స్టేషన్ల కూడళ్ళ మీదుగా ఆర్టీసీ డిపో వరకు జాతీయ జెండాలను, కాంగ్రెస్ పార్టీ జెండాలను చేతబట్టి పెద్దసంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలతో ఈ ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు నగర కాంగ్రెస్ అధ్యక్షులు ఉడతా వెంకట్రావు, పిసిసి అధికార ప్రతినిధి ఎల్.సురేష్‌బాబు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కె.పవన్‌కుమార్, పి.గణేష్‌బాబు, షేక్ అల్లావుద్దీన్, ఎన్.మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగరాజు, సంగం ప్రసాద్, తిరుపాలు ర్యాలీని పర్యవేక్షించారు.

## టూకీగా...



### సర్దార్ గౌతు లచ్చన్నకు బీసీ నాయకుల నివాళులు

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 113వ జయంతి సందర్భంగా ఈనెల 16న నెల్లూరులో బీసీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర బీసీ సమాఖ్య మాజీ ప్రధాన కార్యదర్శి కనకట్ల రఘురామ్ ముదిరాజ్, గౌడ ఉద్యోగసంఘం నాయకులు మల్లికార్జునగౌడ్, మన్నెం సుబ్రహ్మణ్యం, పి.శ్రీరాములుగౌడ్, అన్నాబత్తిన కృష్ణ గౌడ్, చల్లా రమేష్‌గౌడ్, మస్తానయ్య గౌడ్‌లు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు.

### రొట్టెల పండుగకి.. ఆర్టీసి ఆదాయం 10 లక్షలు

నెల్లూరు బారాషహీద్ దర్గాలో ఈనెల 9 నుంచి 13వతేదీ దాకా జరిగిన రొట్టెల పండుగకి 45 ప్రత్యేక ఆర్టీసి బస్సులు నడపడంతో ఆర్టీసి నెల్లూరు రీజియన్‌కు 10 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందని, నెల్లూరు నుంచి కనుమూరు, ఆత్మకూరు నుంచి అనుమసముద్రంపేటలకు బస్సులు నడపడం జరిగిందని ఆర్టీసీ అధికారి పివి శేషయ్య తెలిపారు.

### డ్వామా పీడీగా.. వెంకట్రావు

జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా బాపట్ల ఐటిసి డైరెక్టర్‌గా పనిచేస్తున్న వెంకట్రావును నియమితులయ్యారు. నెల్లూరులోని డ్వామా కార్యాలయంలో ఆయన ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన జిల్లాలోని పొదలకూరు, నెల్లూరు, ఏఎస్‌పేటలలో ఎంపిడిఓగా, డ్వామా ఏపీడీగా కూడా పనిచేసివున్నారు.

### దువ్వూరు కాలువ లీకేజీ నీళ్ళతో.. పంటపొలాలు బురదమయం

సంగం మండలంలో దువ్వూరు కాలువ నుండి లీకేజీ నీళ్ళంతా వచ్చి చుట్టుపక్కల పొలాలన్నీ బురదమయం అవుతున్నాయని, దీంతో పంటలు సాగుచేసుకోవడం ఇబ్బందిగా ఉందని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు తమ వేదన వినిపించినా పట్టించుకోవడం లేదని, జిల్లా ఉన్నతాధికారులైనా తమ సమస్యను పరిశీలించి లీకేజీ నీటిని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

### కుళ్లిన కోడిగుడ్లు, నాసిరకం తిండి.. ఇదేనా మధ్యాహ్నభోజనం?

విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్నభోజనం పెడుతున్నా అదంతా నాసిరకంగానే ఉందని, కుళ్ళిన కోడిగుడ్లు, నాసిరకం కూరలు.. ఇదేనా మధ్యాహ్నభోజనం అంటూ.. మధ్యాహ్నభోజన కార్మికుల సంఘం నాయకురాలు రెహానాబేగం విమర్శించారు. తోటపల్లిగూడూరులోని నరుకూరులో ఇటీవల ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు చిరిగిపోతున్న బ్యాగులు, పాడైపోయిన చిక్కీలు పంపిణీ చేస్తుండడం దారుణమన్నారు. ఇకనైనా విద్యార్థులకు మంచి భోజనం పెట్టాలన్నారు.

### అన్నారెడ్డిపాలెంలో పోలేరమ్మకు లక్ష కుంకుమార్చన

సంగం మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారికి ఈనెల 16న లక్ష కుంకుమార్చన పూజలు వైభవంగా చేశారు. ఆలయ అర్చకులు గోసుకొండ వెంకటరమణ, కోటేశ్వరరావు అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

### నెల్లూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు సెప్టెంబర్ 2న

నెల్లూరు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు సెప్టెంబరు 2న జరుగనున్నాయి. ఆమేరకు బార్ ఎన్నికల అధికారి శ్రీనివాసరెడ్డి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. అసోసియేషన్‌కు అధ్యక్ష, ప్రధానకార్యదర్శులతో పాటు 13 మంది కార్యవర్గసభ్యులను కూడా ఎన్నుకోనున్నారు. 2వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది. అదేరోజు సాయంత్రం కౌంటింగ్ జరుగుతుంది. 3న కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించనున్నారని సమాచారం.



## ఆ కాలం ఏమి నేర్పింది??

పొలం గట్లపై నడిపించి,
తడబడకుండా
నిలదొక్కుకోవటం నేర్పింది.

వాగు పక్కన
నీటి చెలిమలు తీయించి,
శోధించే తత్వం నేర్పింది.

సీతాఫలాల కోసం
చెట్ల చుట్టూ తిరిగించి,
అన్వేషణ నేర్పింది.

తుమ్మ ముల్లు,
పల్లేరు గాయాల గుచ్చులతో,
జీవితం పూలపాన్పు
కాదని నేర్పింది.

చిన్న చిన్న దెబ్బలు తగిలితే,
నల్లాలం ఆకు పసరు పోయించి,
చిన్న చిన్న ఇంటి వైద్యం
చిట్కాలు నేర్పింది.

చెట్టుమీద మామిడికాయను
గురిచూసి కొట్టడం,
లక్ష్యాన్ని ఛేదించడం నేర్పింది.

నిండు బిందెను నెత్తి మీద పెట్టి,
నీళ్లు మోయించి,
జీవితమంటే బరువు కాదు..
బాధ్యత అని నేర్పింది.

బావి నుండి బొక్కెనతో
నీళ్లు తోడించి,
బాలన్స్‌గా
బరువు లాగటం నేర్పింది.

ఇంటి ముంగిటకు
అతిథి దేవతలు, హరిదాసులు
గంగిరెద్దులను రప్పించి,
ఉన్న దాంట్లో కొంత పంచుకునే
గుణం నేర్పింది.

విస్తరిలో, అన్నం అంచులు దాటి
కింద పడిపోకుండా తినే
ఒద్దికను నేర్పింది.

ఒక్క పిప్పరమింట్‌ను,
బట్ట వేసి కొరికి ముక్కలు చేసి,
కాకి ఎంగిలి పేరుతో
స్నేహితులతో
పంచుకోవటం నేర్పింది.

ముళ్ళు గుచ్చుకోకుండా,
ఒక్కటొక్కటిగా రేక్కాయలు తెంపే
ఓర్పును నేర్పింది.

దారంతో విల్లును చేయించి,
వస్తు తయారీ మెళకువలు నేర్పింది.

అత్తా, మామా, అన్నా వదినా,
అమ్మమ్మా, నాయనమ్మా, తాతయ్యా
వరుసలతో ఊరు ఊరంతా
ఒక కుటుంబమనే
ఆత్మీయత నేర్పింది.

ధైర్యంగా బ్రతికే
పాఠాలను నేర్పిన
మన బాల్యానికి
జీవితాంతం
రుణపడి ఉందాం.

**ఈ కవిత ఎవరు రాశారో తెలియదు కానీ, ఆన్‌లైన్‌లో అందరినీ ఆకట్టుకుంటోంది. బాల్యాన్ని జీవితానికి అన్వయిస్తూ అద్భుతంగా రచించిన ఆ కవికి 'లాయర్' అభినందనలు.**

### 'ఉత్తమ ఉపాధ్యాయ' పురస్కారాలకు
## 24లోగా వివరాలు పంపండి
### డిఇఓ రమేష్

ఉపాధ్యాయ దినోత్సవం (సెప్టెంబరు 5వ తేది) పురస్కరించుకుని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కోసం ఉపాధ్యాయులు దరఖాస్తులు పంపాలని డిఇఓ రమేష్ ఓ ప్రకటనలో కోరారు. ఆగస్టు 24వ తేదిలోగా వివరాలు పంపాలని, దరఖాస్తులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని అధికారులకు సమర్పించాలని, తమ ప్రతిపాదనలను ఆఫ్‌లైన్ పద్ధతిలో తయారుచేసి అందజేయాలని, వివరాలకు ఎంఇఓ, లేదా డెప్యూటీ డిఇఓలను సంప్రదించాలని సూచించారు.

### రైతుల కోసం..
## సిపిఎం 'చైతన్య జాతా'లు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 21 దాకా రైతు చైతన్య జాతాలు నిర్వహిస్తున్నట్లు రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర రాజగోపాల్ తెలిపారు. ఈనెల 16న మనుబోలులో ఈ జాతాను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం సంయుక్తగా మనుబోలు, సైదాపురం, రాపూరు, చేజర్ల, పొదలకూరు మండలాల్లో పర్యటిస్తుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3 జాతాలు జిల్లాలోని అన్ని మండలాల్లో జాతాలు నిర్వహించి ఈనెల 21వ తేదిన నెల్లూరుకు చేరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుళ్ళూరు గోపాల్, కార్యదర్శి లక్ష్మీపతి, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కటికాల వెంకటేశ్వర్లు, రైతుసంఘం మండల కార్యదర్శి తలారి దేవదానం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బిసి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### అల్లూరులో
## స్వాతంత్ర్య సంబరాలు



అల్లూరులోని సిద్ధార్థ స్కూల్‌లో ఆగస్టు 15న 76వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు జరిగాయి. అల్లూరు నగర పంచాయతి కమిషనర్ ఫణికుమార్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. కరెస్పాండెంట్ హనుమాచార్యులు స్వాతంత్ర్యోద్యమకారులకు నివాళులర్పించారు. అనంతరం నూకలపాటి పార్వతమ్మ, సందీప్ రెడ్డిల సౌజన్యంతో 10వ తరగతిలో మొదటి మూడు స్థానాలు పొందిన విద్యార్థులకు వరుసగా 10వేలు, 5వేలు, 3 వేల రూపాయలను ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# జిల్లాలో పెరిగిపోతున్న పోలీసు దురాగతాలు
### - మాజీమంత్రి సోమిరెడ్డి ధ్వజం



జిల్లాలో పోలీసుల దురాగతాలు మరీ పెచ్చుమీరిపోతున్నాయని, అమాయకులను పట్టుకుపోయి ఇష్టంవచ్చినట్లు కొడుతుండడం దారుణమని, ఇలాంటి అన్యాయాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోలీసుల తీరుపై మండిపడ్డారు. బుధవారం నగరంలోని పెద్దాసుపత్రిలో వెంకటాచలం మండలం ఎగువమిట్ట గ్రామానికి చెందిన ఆర్టీసి డ్రైవర్ చంద్రశేఖర్‌ను ఆయన పరామర్శించారు. పోలీసులు కొట్టడంతో చంద్రశేఖర్ గాయపడ్డాడని ఆయన అంటూ, పోలీసులు విచారణ చేయకుండానే విచక్షణ రహితంగా కొట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇటీవల వెంకటాచలం మండలంలో పోలీసుల దుర్మార్గాలకు అంతులేకుండా పోతోందని, పోలీస్‌స్టేషన్లు యమపాశాలుగా మారుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని సహించేది లేదని, రోడ్డెక్కి తాడోపేడో తేల్చుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డితో పాటు నాయకులు బొమ్మి సురేంద్ర, కప్పిర శ్రీనివాసులు, రేవతి, జి.రాజాయాదవ్, ఎస్.సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఇంటి తాళాలు పగులగొట్టి
## బంగారం దోచుకున్నారు

ఇళ్ళకు తాళాలు వేసి వెళ్తే భద్రంగా ఉంటుందనుకుంటే, తిరిగి వచ్చేలోగా దొంగలు దోచేస్తున్నారు. ఇటీవలి కాలంలో ఈ తరహా చోరీలు పెరిగిపోతూనే ఉన్నాయి కానీ, దొంగలు మాత్రం చిక్కడం లేదు. నెల్లూరు నగరంలోని లేక్‌వ్యూ కాలనీలో పెద్దాసుపత్రిలో నర్సుగా పని చేస్తున్న రాజ్యలక్ష్మి ఇంటికి తాళం వేసి ఈనెల 12న విజయవాడకు వెళ్ళారు. సోమవారం రాత్రి తిరిగి ఇంటికి వచ్చి చూసుకునేసరికి ఏముందీ?..ఇల్లంతా చిందరవందరగా ఉంది. తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 5వేల రూపాయలతో పాటు, ఒకటిన్నర లక్షల విలువైన బంగారాన్ని దొంగలు దోచుకుపోయారు. బాధితురాలు లబోదిబోమంటూ దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి దొంగల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

## సంపూర్ణ ఆహారంతో ఆరోగ్యం



విద్యార్థులు సంపూర్ణ ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ చెరుకూరు రోహిణి తెలిపారు. గూడూరు పట్టణంలోని సిఎస్ఎం పాఠశాలలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇటీవల రక్తపరీక్షలు చేసి, హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ విద్యార్థులు సక్రమంగా ఆహారాన్ని తినకపోవడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ప్రతినిధులు స్నేహలతారెడ్డి, విష్ణువందన, జీవనరెడ్డి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల ముసుగులో రాక్షసులు
(మొదటి పేజీ తరువాయి)

రాజకీయాలను వేదికగా వాడుకుంటున్నారు. తమను తాము రక్షించుకోవడానికి ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పంచన చేరిపోతున్నారు. కొంత మంది నేతలైతే నెలల తరబడి జైల్లలో ఉండి బెయిలుపై బయటకు రాగానే ఏదో ఒక అధికార పార్టీలో చేరిపోతున్నారు. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కూడా ఈ మాఫియాడాన్‌ల నేరచరిత్రను అడ్డం పెట్టుకుని వాళ్ళని భయపెట్టి తమవైపుకు తిప్పుకుంటోంది. వందల, వేల కోట్లు బ్యాంకులకు ఎగనామం పెట్టిన వాళ్లంతా ఇప్పుడు బీజేపీని తమ రాజకీయ భవిష్యత్తు కోసం వేదిక చేసుకుంటున్నారు.

నేరస్తులకు రాజకీయాలలో స్థానం ఉండకూడదంటూ సంఘసంస్కర్తలు కొన్ని దశాబ్దాలుగా న్యాయస్థానాలలో పోరాడుతూనే ఉన్నారు. ఎన్నికలలో పోటీ చేసేవారిపైన ఎన్ని కేసులు ఉన్నా అవి రుజువు కాబడి, శిక్ష ఖరారు అయ్యేవరకు వాళ్ళు ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొనవచ్చన్న సడలింపుతో మాత్రమే న్యాయస్థానాలు తీర్పులు చెప్పాయి. నేరం ఆరోపించబడిన వారు ఎన్నికలలో నిలబడకూడదన్న నిబంధన ఎక్కడా లేదు. ఆ ఒక్క సడలింపే నేర నాయకుల పాలిట వరంగా మారింది. ఆ ఒక్క మినహాయింపును ఆధారం చేసుకుని ఎన్నికల బరిలో దిగుతున్నారు.

### కోట్లు ఖర్చు పెడుతున్నారు...
### అంతకు వంద రెట్లు సంపాదిస్తున్నారు

ప్రస్తుత సమాజంలో ఎలక్షన్ అంటే బరిలో నిలవక ముందు సెలెక్షన్, కలెక్షన్... ఎన్నికలలో గెలిచిన తరువాత కరప్షన్. ప్రతిచోటా ఇదే సంస్కృతి నడుస్తోంది. ప్రజల గురించి ఆలోచించే నాయకులే కరువయ్యారు. ఒకవైపు ధన సంపాదనకు ప్రాధాన్యత ఇస్తూనే మరోవైపు దౌర్జన్యాలకు, రౌడీయిజానికి, దుర్మార్గాలకు పాల్పడడానికి మందిని పెంచి పోషిస్తున్నారు. సమాజంలో చెడుతిరుగుళ్లతో తమ జీవితాలను నాశనం చేసుకుంటున్న యువతను గుర్తించి పార్టీల నాయకులు వాళ్ళని తమ పంచన చేర్చుకుంటున్నారు. తమకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడుతున్నారని తెలిసినా, తమపై పత్రికలలో వ్యతిరేక వార్తలు రాసినా, ప్రభుత్వ అధికారులు తాము చెప్పిన పనులు చేయకపోయినా... ఈ అల్లరి మూకను వారిపై ప్రయోగిస్తున్నారు. ముఖ్యంగా అధికార పార్టీ నాయకులు ఈ తొట్టి గ్యాంగుకి తామున్నామని భరోసా కల్పిస్తున్నారు. తాముున్నంత వరకు పోలీసులు, కేసులు మిమ్మల్నేమీ చేయలేవని హామీ ఇచ్చి మరీ నేరాలు చేయిస్తున్నారు.

అధికార పార్టీలో మంత్రులుగా, ఎంపీలుగా, ఎంఎల్ఏలుగా ఉన్న నాయకులే బూతుపురాణాలు వల్లిస్తూ స్వయంగా వాళ్ళే వ్యక్తిగత దాడులకు దిగుతుంటే ఇక మనకేం అన్న ధీమాతో ఈ చిల్లర రౌడీమూక కూడా రెచ్చిపోతున్నారు. అధికారపార్టీ వాళ్లతో మనకెందుకులే, నెలైతే మన కొచ్చేది మన కొస్తే చాలన్నట్లు పోలీసుశాఖ కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోంది. రానున్న రోజుల్లో పరిస్థితులు ఇంకా ఘోరంగా తయారవుతాయని, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా దాడులు, దౌర్జన్యాల సంస్కృతి మరింత పెరిగేదే తప్ప తగ్గేది ఉండదని రాష్ట్ర పోలీసుశాఖలో పనిచేసే ఒక నిఖార్సైన ఉన్నతాధికారి చెప్పడం గమనార్హం. పార్టీల నేతలు, వారి అనుచరుల మూక చేస్తున్న ఆగడాలు చూస్తూ, చావ చచ్చిన అధికారిగా ఉండడంకన్నా రాజీనామా చేసి వెళ్లిపోవాలని పిస్తుందన్న ఆవేదనను ఆయన 'లాయర్'తో పంచుకున్నారు. ఇలాంటి పరిస్థితులలో దేశ భవిష్యత్తు ఎలా ఉండబోతుందోనన్న ఆందోళన మేధావుల నుండి వ్యక్తమవుతోంది.

## దేశభక్తి, నైతిక విలువల పరిరక్షణే..
# బ్రహ్మకుమారీల ధ్యేయం



దేశభక్తి, నైతిక విలువల పరిరక్షణే ధ్యేయంగా బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కృషి చేస్తుందని బ్రహ్మకుమారీ ప్రసన్న అన్నారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' సందర్భంగా నెల్లూరు వేదాయపాలెంలోని బ్రహ్మకుమారీస్ కార్యాలయంలో ఈనెల 13న జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మక శక్తిని, నైతిక విలువలను, పెద్దలను గౌరవించే సంప్రదాయాన్ని వగైరా సద్గుణాలను పెంపొందించేందుకు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అందుకోసం తమ సంస్థ విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తోందన్నారు, శాస్త్రవేత్తలుగా, అధికారులుగా, నాయకులుగా దేశాన్ని ముందుకు నడిపించే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, చిన్నారులకు రాఖీ కట్టారు. నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాశ్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ షేకరసూల్, మాల్యాద్రి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ప్రముఖ కవి డా. నాగభైరవ
# 91వ జయంతి వేడుకలు



ప్రముఖ కవి డా.నాగభైరవ కోటేశ్వరరావు 91వ జయంతి వేడుకలు ఆగస్టు 15న నెల్లూరు పుర మందిరంలో ఘనంగా జరిగాయి. సారస్వతవేత్త డా.కాళిదాసు పురుషోత్తం అధ్యక్షత వహించారు. స్థానిక 'చేతన' సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక కార్యదర్శి వై.శేషగిరీశం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీదర్శకులు నాగభైరవ వీరబాబు, వీరిశెట్టి హజరత్‌బాబు, ప్రముఖ కవి చిన్ని నారాయణరావు, డిఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు, పాత్రికేయులు ఈతకోట సుబ్బారావు, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్య నాయుడు, న్యాయవాది పి.రమాదేవి తదితరులు పాల్గొని నాగభైరవ సాహితీ వైశిష్ట్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా నాగభైరవ స్మారక పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త మెట్టు రామచంద్రప్రసాద్‌కు బహూకరించారు. విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డా.ఎం.సుబ్రహ్మణ్యం సభను స్వాగతించి నిర్వహించారు. అనంతరం నాగభైరవ అత్యద్భుతంగా రచించి రూపొందించిన 'కవనవిజయం' ఆధునిక సాహితీ రూపకాన్ని 504వ ప్రదర్శనగా ఈ వేదికపై కవులు, కళాకారులు ప్రదర్శించి అందరి ప్రశంసలందుకున్నారు. ప్రయోక్తగా డా.భూసురపల్లి వెంకటేశ్వర్లుతో పాటు బి.బ్రహ్మారెడ్డి, పివి సుబ్రహ్మణ్యం, ఎన్‌వి ప్రసాదరావు, కప్పగంతు జయరామయ్య, డా.నూనె అంకమ్మరావు, ఈదుమూడి ఆంజనేయులు, శేష గిరీశం, నూకతోటి శరత్, డా. బీరం సుందరరావు, తెళ్ల అరుణ, వి.ఝాన్సీదుర్గ పాల్గొని ప్రదర్శనను రక్తికట్టించారు. వై. విశ్వనాథం, గట్టుపల్లి ఆదిశేషు, రాకేష్ తదితరులు సహకరించారు.

# బాపూ!.. మమ్మల్ని క్షమించు!

మన దేశానికి స్వతంత్రం వచ్చి 75సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంలో దేశంలో ఒక్కసారిగా దేశభక్తి ఉప్పొంగుతోంది. భూమి లోంచి పైకి గ్యాస్ తన్నుకొచ్చినట్టు... హృదయాంతరాళాల్లోంచి దేశభక్తి ఉబుకుతోంది.

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎక్కడ చూసినా త్రివర్ణ పతాకాలే. భవనాల మీద, కార్లు, ఇతర వాహనాల మీద, రోడ్ల మీద, విద్యార్థుల చేతుల్లో, చిత్ర విచిత్ర వేషధారణలలో నాయకుల ఖద్దరు & నాన్ ఖద్దరు దుస్తులపైన, ఛానళ్లలో, పత్రికా ప్రకటనల్లో... మొబైళ్లలో... ఎక్కడ మన చూపులు ప్రసరించడానికి వీలుంటే... అక్కడల్లా త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. నరేంద్ర మోడీ సందేశం చెవుల్లో గింగురుమంటోంది. ఆ భావనలతో ఒక్కసారిగా ఉద్వేగం ఉప్పొంగిపోతోంది.

ఈ డెబ్బై అయిదవ స్వాతంత్ర్య దినాన మన నేతలు బాపు ఘాట్‌ల వద్ద మన జాతిపితకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు. భీషణ ప్రతిజ్ఞలు చేస్తున్నారు. ఓ ఘాట్ వద్ద నేతలు చేరారు. వారి మోహాలలో పశ్చాత్తాప భావన కనపడుతోంది. బాపు పాదాల వద్ద నిలబడి నిజాయతీతో ఇక ముందు రాజకీయాలు చేస్తామని, రాజకీయాల కోసమని చెప్పి నోటికొచ్చిన అబద్ధాలు ఆడము అని, ఓట్ల కోసం అమాయక ప్రజలను ఉత్తుత్తి వాగ్దానాలతో మోసం చేయము అని, వారిని మద్యం, డబ్బుల ఆశతో అవమాన పరచము అని, ఉచితాలతో వారి ఆత్మాభిమానానికి తూట్లు పొడవం అని, రాజకీయాలు అడ్డం పెట్టుకుని అక్రమ సంపాదనకు పాల్పడము అని, కబ్జాలకు, అత్యాచారాలకు, హత్యలకు, దొమ్మీలకు, దొంగ వ్యాపారాలకు, చట్ట వ్యతిరేక పనులకు పాల్పడం అని, ఇసుక రీచ్‌లు బొక్కేయం అని, దొంగ మైనింగ్ అంటే చెవి కోసుకోం అని, ఓట్లేసిన ప్రజల పట్ల సగౌరవంగా వ్యవహరిస్తాం... అని గాంధీ గారి మీద ప్రమాణాలు చేస్తున్నారు. బూతులు మాట్లాడమని, మహిళలకు ఏదిపడితే అది చూపించం అని కూడా ప్రతిజ్ఞలు చేస్తున్నారు.

గాంధీజీ అన్నీ మౌనంగా వింటున్నారు.

తల మరో పక్కకు తిప్పి చూస్తే... మరో గుంపు. గాంధీజీకి ఏదో చెప్పుకుంటున్నారు. వాళ్లంతా వైట్ & వైట్‌లో... మెడల్లో పలుపుతాడు లాంటి గోల్డు చైనులు, చేతులకు బ్రేసులెట్లు, నైక్ బూట్లు, తలలకు గోద్రెజ్ నల్ల రంగు వేసుకుని 'బందరు బంగారం'లా మిలమిల మెరిసిపోతున్నారు. జవజవ లాడిపోతున్నారు. 'బాపూ! మేము... ప్రభుత్వ ఉద్యోగులం. ఇన్నాళ్ళు ఒక చేత్తో ప్రభుత్వాలను, ఒక చేత్తో జనాన్ని పీక్కుతిన్న మాట నిజమే! ప్రజలకు సేవలు అందించడానికి మనుషులు కావాలి కనుక... మాకు ఉద్యోగాలు ఇచ్చారు అనే విషయాన్ని మర్చిపోయాం. మా కోసమే ప్రభుత్వాలు, జనం ఉన్నారనే అహంకారంతో వాళ్ళపై పెత్తనంలో బడి, మేం చెయ్యాల్సిన పనులు మర్చిపోయాం. తప్పయిపోయింది. నువ్వు తెచ్చిన స్వతంత్రానికి అర్థం, పర్థం లేకుండా చేశాం.

ఇక లంచాల కోసం జనాన్ని, కొత్త సౌకర్యాల కోసం ప్రభుత్వాలనూ పీడించం. మా డ్యూటీలు మేం చేస్తాం. మమ్మల్ని క్షమించమని నీ పాదాలు పట్టుకుని వేడుకుంటున్నాం...' ఇంకా ఏవేవో చెబుతూ కళ్ళనీళ్ళ పర్యంతమైపోతున్నారు.

గాంధీజీ ఏమీ అనలేదు. అలాగే, గంభీరంగా ఉన్నారు.

అవన్నీ విని, ఉద్యోగులకు ఈ 75వ స్వతంత్ర దినోత్సవ శుభవేళ ఎంత మంచి బుద్ధి కలిగిందో కదా అనుకుంటూ... మనసుకు చాలా సంతోషం వేసింది. ఈ జాతిపిత ఘాట్ ఇలా జనంతో నిండిపోవడంతో మరో ఘాట్‌కు వెళితే....

అక్కడ... ఖాకీ యూనిఫామ్‌లో ఉన్న మరికొంత మంది ఆ గాంధీజీ ఘాట్ వద్ద ప్రతిజ్ఞల మీద ప్రతిజ్ఞలు చేస్తూ కనిపించారు.

"గాంధీజీ! మేం పోలీసులం. ఇప్పటి దాకా ఎలా ఉన్నామో... మా నోటితో మేం చెప్పుకోలేం. కానీ, ఇకముందు రూల్ ఆఫ్ లా పాటిస్తాం. అన్యాయంగా పట్టుకొచ్చి చంపేయం. దొంగ కేసులు పెట్టం. లంచాల కోసం పీడించం. ఇదిగో... నీ విగ్రహం సాక్షిగా చెంపలేసుకుంటున్నాం. గుంజీలు కూడా తీయాలని ఉంది గానీ, మోకాళ్ళు వంగవ్. ఇప్పటి దాకా తిన్న దాంట్లో సగం... 'వైయస్సార్ జగనన్న విద్యా దీవెన'కు విరాళంగా ఇచ్చేస్తాం. మా తప్పులను క్షమించు బాపూ" అంటూ నెత్తి మీద టోపీ, చంకలో కర్ర తీసి ఆయన పాదాల వద్ద పెడుతున్నారు. తమను క్షమించమని పరి పరి విధాలుగా గాంధీజీని అర్థిస్తున్నారు. ఈ 75వ స్వాతంత్ర్య శుభ సమయాన వారిలో వచ్చిన ఈ పరివర్తనకు ఎంతో ముచ్చటేసింది. మనసు తేలిక పడింది.

ఇంతలోనే ఎవరో సామూహికంగా చెంపలు వేసుకుంటున్న శబ్దం వినబడింది.

అటు దిరిగిచూస్తే, మూరెడేసి బాల్‌పెన్‌లు,ఛానెళ్ళ లోగోలు పట్టుకుని జనం.

బాపు ఘాట్ దగ్గర కిటకిటలాడుతున్నారు.

'బాపూ! నువ్వూ జర్నలిస్టువే కదా! అందుకే చేసిన పాపాలు ఈ పవిత్ర దినం నాడు నీతో చెప్పుకుంటే పోతాయని వచ్చాం. ఉన్నవీ లేనట్టు, లేనివి ఉన్నట్టు ఇన్నాళ్ళు ప్రచారం చేసి, ప్రసారం చేసి... ప్రజల పట్ల మహాపచారానికి పాల్పడ్డాం. నాయకులు, పోలీసులు, ఉద్యోగులు, మేస్త్రర్లు, కాంట్రాక్టర్లు, ఆఫీసర్లు, రాజకీయ పార్టీలు సిగ్గొదిలేసి జనం మీద పడినట్టే... మేమూ సిగ్గూ, ఎగ్గూ వదిలేశాం. జనం




ఛీ ఛీ అంటున్నా దులపరించుకుని తిరిగాం బాపూ. ఇక ముందు నాయకులకు గాక, మా వృత్తికి న్యాయం చేస్తామని ప్రమాణం చేస్తున్నాం. మమ్మల్ని క్షమించు, మీడియా అని చెప్పుకుంటూ ఇన్నాళ్ళు బోర విరుచుకు తిరిగినందుకు... మా మీద మాకే అసహ్యంగా ఉంది. ఇవ్వాల్టి నుంచీ మారిపోతాం. కవర్లకు, సూట్‌కేసులకు కక్కుర్తి పడం...' అంటూ కళ్ళ వెంట నీళ్లు కార్చుతున్నారు. ఇది కూడా న్యూసే గదాని, ఆ దృశ్యాలను కెమెరామెన్లు ఒకరి మీద ఒకరు పడి, పోటాపోటీగా షూట్ చేస్తున్నారు. చిత్రం. ఈ గుంపులో నూనూగు మీసాల వారి దగ్గరి నుంచి, వారి మాటలు విని మనసు పులకరించింది. ఇక, బాపూ దయవల్ల టీవీలు నిర్భయంగా చూడొచ్చు..., పేపర్లు నిస్సందేహంగా చదవచ్చు, అనిపించింది. వీళ్లంతా అటు వెళ్ళారో... లేదో మళ్ళీ, మరో గుంపు. బాపుకి పడీ పడీ దండాలు పెట్టుకుంటూ, చెంపలేసుకుంటున్నారు. ఒక్కొక్కరికీ వంటి మీద యాప్రాను, మెడలో స్టెతస్కోపు. చూడగానే, వైద్యులు అనిపిస్తోంది. 'వైద్యో... నారాయణో హరి...' అన్నారుగా, వీళ్ళు ఎందుకు బాపు ఘాట్‌కు వచ్చారా అని ఆశ్చర్యమేసింది.

అందర్లోకి బాగా కాస్ట్లీగా ఉన్నాయన.... అందరి తరపున బాపుకు నివేదిస్తున్నాడు.

'అవును బాపూ! మేమంతా వైద్యులమే గానీ, వైద్యం పెద్దగా తెలియదు. గజ్జికి ఓ స్పెషలిస్టు. తామరకు ఓ స్పెషలిస్టు, కుడి కన్నుకు ఓ స్పెషలిస్టు,



ఎడం కన్నుకు ఓ స్పెషలిస్టు లాగా తయారయ్యాము. అన్నిటికీ ప్యాకేజీలే. పేషెంట్ దొరికితే టెస్ట్‌లు, మెడికల్ షాపుల్లో పెర్సెంటేజీలతో వైద్య వృత్తికి కళంకం తెస్తున్న మాట నిజమే. కానీ, ఏం చెయ్యం బాపూ? మూడు, నాలుగు కోట్లు పెడితేగానీ... డిగ్రీ రావడం లేదు. పెళ్లిళ్లు కావడం లేదు. సాయంత్రానికి ఓ లక్ష సంపాదిస్తే గానీ కుదరడం లేదు. ఆరోగ్యశ్రీలు, ఆపరేషన్లు, ఉచిత వైద్య శిబిరాలు, టెస్ట్‌లు, ప్రిస్క్రిప్షన్లు అంటూ సంపాదనే ధ్యేయంగా బతుకుతున్నాం. మమ్ముల్ని చూస్తుంటే, మాకే సిగ్గేస్తున్నది. ఇక, ఈ బతుకులకు స్వస్తి చెబుతామని నీకు చెప్పుకోడానికే ఇక్కడికి వచ్చాం. ముందు వైద్యం నేర్చుకుంటాం. ఆ తర్వాత, ప్రజలకు చికిత్స చేస్తాం బాపు. మాట తప్పితే, మా పెళ్ళాం పిల్లలపై ఒట్టు' అంటూ కళ్ళ వెంట నీరు కారుస్తున్నారు. వారి నిజాయితీకి బాపు ఆనందిస్తూ, బోసి నోటితో ఓ చిరునవ్వు నవ్వుతున్నట్టు అనిపించింది.

ఇలా.... సమాజంలోని అన్ని వర్గాల వారు అందుబాటులో ఉన్న ఏదో ఒక వృత్తిని చేపట్టి, సమాజాన్ని పీల్చి పిప్పి చేస్తున్నవారంతా ఈ 75వ స్వతంత్ర దినం నాడు జాతిపిత బాపూజీ విగ్రహం ముందు నిలబడి, తాము సమాజానికి ఎంత భారంగా... శిరోవేదనగా మారారో కన్నీళ్లతో చెప్పుకుంటూ తాము తిరిగి మనుషులుగా ప్రవర్తిస్తామని ప్రతిజ్ఞలు చేస్తుంటే... ఎక్కడో ఆనంద డోలికల్లో విహరిస్తున్నట్టుగా అనిపిస్తోంది.

కొంచెం ఓపిక చేసుకుని, మరో బాపూ ఘాట్‌కి వెళదాం అనుకునే లోపు ఓ భారీ జన సమూహం ఊరేగింపుగా ఘాట్ వైపుకు వస్తున్నారు. మగవారితో పాటు ఆడవారు కూడా ఉన్నారు. వారి మోహాల వంక తేరిపార జూస్తుంటే... ఏదో అపరాధ భావనలో ఉన్నట్టు కనబడుతున్నారు.

ఘాట్ వద్దకు వచ్చారు. బాపూ పాదాలపై పడ్డారు.

'బాపూ! మేము. ఈ నియోజకవర్గ ప్రజలం. వీళ్లందరూ ఇలా తయారు కావడానికి మేమే కారణం. వాళ్ళిచ్చిన డబ్బులకు, మందుకు కక్కుర్తి పడి ఇలాంటి వాళ్ళను గెలిపించాం. మిగిలిన వాళ్ళను వాళ్ళు తయారు చేశారు. అందరూ కలిసి మా రక్త మాంసాలు పీక్కు తింటున్నారు.


మాకు బుద్ధి వచ్చింది. ఇక, డబ్బులు తీసుకునో... మందు తాగో ఓట్లేయం. ఉచితంగా ఇస్తున్నారు గదా అని గడ్డి తినం. కష్టపడి గౌరవంగా బతుకుతాం. నీ మీద ఒట్టేసి చెబుతున్నాం...' అంటూ ఏదేదో ఇంకా చెబుతున్నారు.

ఇంతలో.. "తాతా! టైమ్ పదయ్యింది. ఇంకా నిద్రేంటి? పగటి కలలేమైనా కంటున్నావా?" అంటూ మా మనుమడు మొహం మీద కాసిన్ని నీళ్లు చల్లాడు.

కళ్ళు నులుపుకుని లేచి కూర్చుని టీవీ పెడితే ఢిల్లీలో మోడీ. ఇరగదీస్తున్నారు. ఇక్కడ మన ముఖ్యమంత్రులు ఉపన్యాసాలు దంచుతున్నారు. మరి, స్వాతంత్ర్య దినం కదా! ఏటేటా ఈ పద్దు కింద ఎంత ఖర్చో కదా అనిపించింది.

**- భోగాది వేంకట రాయుడు**





## స్నిగ్ధ - అఖిల్

అద్భుతమైన తన మేధస్సుతో , నైపుణ్యవంతమైన శాస్త్ర పరిజ్ఞానంతో పరిశోధనా రంగంలో సంచలనాలు సృష్టిస్తూ, ప్రపంచ పరిశోధనా ప్రయోగ విభాగాలలో భారత దేశ కీర్తిని ఇనుమడింపచేస్తున్న యువ శాస్త్రవేత్త, మన నెల్లూరీయుడు డి. ఆర్. డి. ఓ ఛైర్మెన్ గుండ్రా సతీష్ రెడ్డి -శ్రీమతి పద్మావతిల కుమార్తె స్నిగ్ధ - అఖిల్ (యాడికి శ్రీనివాస్‌రెడ్డి - శ్రీమతి సుమనల కుమారుడు)ల పెళ్లి వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఆగస్టు 10వ తేదీ, హైదరాబాదులోని సీవీకే టెక్ పార్క్‌లోని విశాల వేదిక ఈ కళ్యాణ వేడుక కోసం ముస్తాబైంది. పలు రంగాలకు చెందిన అనేకమంది ప్రముఖులు, సతీష్‌రెడ్డి కుటుంబ ఆత్మీయులు, నెల్లూరు జిల్లాకు చెందిన సతీష్‌రెడ్డి అభిమానులు విశేష సంఖ్యలో ఈ వేడుకలో పాల్గొని కొత్త దంపతులను ఆశీర్వదించారు.

స్నిగ్ధ - అఖిల్‌లకు 'లాయర్' శుభదీవెనలు.

# ఏసిబి ఏఎస్ఐ సురేష్‌బాబుకు.. ఇండియన్ పోలీస్ మెడల్

### - ముఖ్యమంత్రి నుంచి అవార్డు స్వీకరణ

విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలందిస్తున్నందుకు నెల్లూరు లోని ఏసిబి విభాగంలో ఏఎస్ఐగా పనిచేస్తున్న దాచూరు సురేష్ బాబుకు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్ పురస్కారం లభించింది. విజయవాడలో జరిగిన 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.

1989లో కానిస్టేబుల్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సురేష్ బాబు, 2018లో ఏఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. తాను ఎక్కడ పనిచేస్తున్నా అవినీతి అక్రమాలను నిరోధించేందుకు పూర్తిసమయం కేటాయించేవారు. నెల్లూరులోని వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నప్పుడు అనేక క్లిష్టమైన కేసులను ఛేదించారు. రైల్వేలే పనిచేస్తున్నప్పుడు రైళ్ళలో దొంగతనాలకు పాల్పడుతున్న పలువురు భయంకరమైన నిందితుల్ని అరెస్ట్ చేసి శెభాష్ అనిపించుకున్నారు. వెంకటగిరి రాజా ప్యాలెస్‌లో జరిగిన చోరీకేసులో నిందితుల అరెస్ట్‌కు తనవంతు కృషి చేశారు. జీటీ ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన భారీ దోపిడీ కేసులో 2.5 కోట్ల రూపాయల సొత్తును రికవరీ చేయడంలో కీలకపాత్ర ఆయనదే. హెడ్‌కానిస్టేబుల్‌గా ఏపి ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న సమయంలో విద్యుత్ చౌర్యానికి సంబంధించి వేలాదికేసులు నమోదుచేసి 1.10 కోట్ల పెనాల్టీని వసూలుచేశారు. టాస్క్‌ఫోర్స్‌లో విధులు నిర్వహిస్తున్నప్పుడు అంతర్జాతీయ ఎర్రచందనం దొంగలను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించారు. క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో సిడిఆర్ ద్వారా బెట్టింగ్ సూత్రధారులను అనేకమందిని గుర్తించి అరెస్టు చేయించి అధికారుల అభినందనలు అందుకున్నారు. తన సర్వీసులో ఆయన ఇప్పటికే 38 క్యాష్ రివార్డులు, 82 గుడ్ సర్వీస్ ఎంట్రీలు, 7 కమాండేషన్స్, ఉత్కృష్ట సేవా పతకం సాధించారు. విధి నిర్వహణలో సురేష్‌బాబు శ్రద్ధాసక్తులకు, చిత్తశుద్ధికి, ప్రతిభా పాటవాలకు మెచ్చుకుంటూ ఈ అవార్డు రావడం జిల్లా పోలీసుశాఖకే గర్వకారణం. జిల్లా ఎస్పీ విజయారావుతో



పాటు, జిల్లా పోలీసు అధికారులు, ఏసిబి అధికారులు, పోలీసు వర్గాలు సురేష్‌బాబును ఈ సందర్భంగా అభినందించి శుభాకాంక్షలు అందజేశారు.

## రైల్వే పోలీసులకు పతకాలు



విధి నిర్వహణలో ఉత్తమ పనితీరుతో విశిష్ట సేవలందిస్తున్న పలువురు రైల్వే అధికారులు, పోలీసులకు 76వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సేవా పతకాలను బహుకరించారు. ఆగస్టు 15న గుంతకల్ రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎస్పీ అజిత వెజెండ్ల ఈ అవార్డులను వారికి అందజేశారు. అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో నెల్లూరు రైల్వే డిఎస్పీ టిమురళీకృష్ణ(సేవాపతకం), కావలి ఎస్ఐ టి.అరుణకుమారి, రైల్వే డిఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పివి సురేష్‌బాబు, నెల్లూరు, కావలిలో కానిస్టేబుళ్ళుగా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ సురేష్, వి.మనోహర్, జె.రమేష్‌బాబు, టి.సురేష్ (ప్రశంసా పత్రాలు) ఉన్నారు.



## శ్రీవారి వైభవోత్సవాల్లో.. నెల్లూరు ఎంపీ ఆదాల

నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతున్న శ్రీ వేంకటేశ్వర వైభవాత్సవాల్లో ఈనెల 18వ తేది గురువారం నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆయన్ను సాదరంగా స్వాగతించి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం ఆదాలను శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ, నెల్లూరులో శ్రీ వేంకటేశ్వరుని వైభవోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నూనె మల్లికార్జునయాదవ్, పి.హరిప్రసాద్, నరసింహారావు పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన షార్ మాజీ డైరెక్టర్



షార్ మాజీ డైరెక్టర్ పద్మశ్రీ డా.కె.నారాయణ ఈనెల 16న శ్రీసిటీని సందర్శించారు. ఆయనతో పాటు సూళ్ళూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రాంగోపాల్‌రెడ్డి కూడా వచ్చారు. శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి వారికి స్వాగతం పలికి శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా డా.కె నారాయణ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి పారిశ్రామిక నగరాన్ని నిర్వహించడం అంత తేలికైన పనికాదని, శ్రీసిటీని దేశంలోనే అత్యున్నతమైన పెట్టుబడి గమ్యస్థానంగా మార్చిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డిని అభినందిస్తున్నానని అన్నారు.

## స్వాతంత్ర్య వజ్రోత్సవ వేళ ఇలా...!



ఈయనెవరో గుర్తుపట్టారా...? నెల్లూరుజిల్లాలో పేరుగాంచిన ప్రఖ్యాత జనరల్ ఫిజిషియన్ డాక్టర్ యన్.ఆర్.సాయికుమార్. ఆగస్టు 15న భారత వజ్రోత్సవ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇలా గాంధీ టోపీ, ఖద్దరు బట్టలతో, మెడలో త్రివర్ణ కండువాతో రోగులకు సేవలందించి తన దేశ భక్తిని చాటుకున్నారు డాక్టర్ సాయికుమార్.



## ఇదేనా 'స్వచ్ఛ నెల్లూరు'..?

భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ సంబరంలో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం అత్యుత్సాహంతో స్పందించింది. అందులో భాగంగా నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రముఖుల విగ్రహ కూడళ్ళను రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణతో సొబగులు దిద్దింది. వి.ఆర్. కాలేజీ ప్రాంగణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహ ఐలాండ్‌ను, మద్రాసు బస్టాండ్ వద్ద గల జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహ ఐలాండ్‌ను నగర కార్పొరేషన్ అధికారులు లైట్లతో నింపేశారు. అయితే ఇవే ఐలాండ్‌ల పైనున్న పోస్టర్లు వారి కంటికి కనపడకపోవడం గమనార్హం. కనీసం ఇలాంటి సందర్భాలలోనన్నా ప్రముఖుల విగ్రహాల ఐలాండ్లపై ఉన్న పోస్టర్లను తొలగించాలన్న కనీస స్పృహ కూడా లేని నగర కార్పొరేషన్ అధికారులు 'స్వచ్ఛ భారత్'లో భాగంగా 'స్వచ్ఛ నెల్లూరు'ను తీర్చిదిద్దుతాం అని ప్రగల్భాలు పలకడం ఎందుకో...?

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com